


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు

ఎమ్మెల్సీ అనంతబాబు నివాసంలో సోదాలు

అందుబాటులో లేని ఎమ్మెల్సీ


ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 112 | బుధవారం 22 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3




## నరేంద్ర మోదీపై ఖర్గే ‘ఉగ్రవాది‘ వ్యాఖ్య...

తీవ్రంగా స్పందించిన బండి సంజయ్

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ దేశాన్ని రక్తమోడేలా చేసిందని ఆగ్రహం

మోదీ హయాంలో ఉగ్రవాదుల పట్ల సానుకూల విధానం అంతమైందన్న బండి సంజయ్

మన సైన్యాన్ని ఆధారాలు అడిగిన పార్టీ కాంగ్రెస్ అని ఆగ్రహం

2లో

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి



**పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి**

**మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం**

**ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం**

తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని..

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి



**ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి**

**ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని

## తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

**23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152

## కేరళలో ఘోర విషాదం...

బాణసంచా పరిశ్రమలో పేలుడు, 13 మంది మృతి



త్రిస్సూర్ పూరం వేడుకల్లో భారీ పేలుడు

ఘటనలో 13 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం

అప్రమత్తమైన కేరళ ప్రభుత్వం, సహాయక చర్యలు ముమ్మరం

ఘటనపై విచారణకు ఆదేశించిన అధికారులు

2లో

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?..

**75 ఏళ్ల వృద్ధి నవ యువకుడా?: కేసీఆర్ సభపై కవిత సెటైర్లు**



తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. తన కొత్త పార్టీలో యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగిత్యాలలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ సభలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకు 25 ఏళ్లు తగ్గిపోయాయని, నవ యువకుడిగా అద్భుతాలు చేస్తారని కేసీఆర్ పొగడటం హాస్యాస్పదమన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పచ్చి తెలంగాణ వ్యతిరేకి అయిన జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకుని, తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెబుతుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ పిట్ట కథలు చెబుతోందని, కానీ ఏ ఒక్కరూ ప్రజల కష్టాల గురించి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదని, మహిళా రిజర్వేషన్ల ఊసే ఎత్తలేదని ఆమె మండిపడ్డారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ఆ పార్టీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు.

ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న కల్వకుంట్ల కవిత

మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

యూత్ రాజకీయాల్లోకి రావాలంటూ జాగృతి అధ్యక్షురాలు పిలుపు

తన పార్టీలో యువతకు ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామని వ్యాఖ్య

జీవన్ రెడ్డి చేరికపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కవిత

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటన

2లో

# మోదీని ఉగ్రవాది అనలేదు..



**ప్రభుత్వమే ప్రజలను, సంస్థలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పానన్న ఖర్గే**

**ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ కార్యాలయంలా పనిచేస్తోందని ఆరోపణ**

**మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించలేదని వెల్లడి**

**డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్నే వ్యతిరేకించామని స్పష్టీకరణ**

**దర్యాప్తు సంస్థలను, ధనబలాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం**

ప్రధాని నరేంద్ర మోదీపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం స్పష్టత ఇచ్చారు. తాను ప్రధాని మోదీని ‘ఉగ్రవాది‘ అని పిలవలేదని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరించారు. మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు. “మోదీ ఉగ్రవాది అని నేను అనలేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సంస్థలను, ఏజెన్సీలను బెదిరించడానికి వాడుకుంటున్నారని చెప్పాను“ అని ఖర్గే స్పష్టం చేశారు.

## హార్ముజ్ జలసంధి దాటిస్తామంటూ అధికారుల రూపంలో ఘరానా మోసం



హార్మూజ్ జలసంధికి ఇరువైపులా నిలిచిపోయిన ఇంధన నౌకలు

క్రిప్టోకరెన్సీ చెల్లిస్తే బదులుగా నౌకలను హార్మూజ్ దాటిస్తామంటున్న దోపిడీదారులు

ఇరాన్ అధికారులమంటూ నమ్మబలుకుతున్న దోపిడీదారులు

2లో

**భవన నిర్మాణదారులకు**

## ఊరట

ఖాళీ స్థలాల పన్నులో 50శాతం రాయితీ

2లో

పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ

## ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు

ఒప్పందం కుదిరితే చర్చలకు హాజరుకానున్న ట్రంప్

చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ సానుకూల సమీక్ష

2లో



## గోర్ఖా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం: అమిత్ షా




దశాబ్దాల నాటి గోర్ఖా సమస్యకు పరిష్కారం చూపుతామన్న అమిత్ షా

గోర్ఖా ప్రజల మనోభావాలను అర్థం చేసుకునే పార్టీ బీజేపీయేనని వ్యాఖ్య

ఆరు నెలల్లోనే గోర్ఖాల ముఖంలో ఆనందాన్ని చూస్తారన్న అమిషా

# కేరళలో ఘోర విషాదం...

కేరళలోని ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం వేడుకల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం జరిగిన భారీ పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయ ఉత్సవాల్లో ఒకటైన త్రిస్సూర్ పూరం కోసం బాణసంచా సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు ధాటికి భారీగా మంటలు ఎగసిపడి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రతి ఏటా మలయాళ నెల 'మాడం'లో పూరం నక్షత్రం రోజున త్రిస్సూర్‌లోని వడక్కునాథన్ ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆసియాలోనే అతిపెద్ద పండుగల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ వేడుకకు పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా ప్రదర్శన చాలా ప్రత్యేకం. దీనికోసం సిద్ధం చేస్తున్న షెడ్‌లోనే ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పిస్తామని ఆయన అన్నారు. పోలీస్, ఫైర్, ఆరోగ్య, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సమన్వయంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం త్రిస్సూర్ మెడికల్ కాలేజీలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. బాణసంచా నిల్వ, నిర్వహణలో భద్రతా లోపాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ ఉత్సవాలపై విషాద ఛాయలు అలుముకున్నాయి.

# హర్మూజ్ జలసంధి దాటిస్తామంటూ అధికారుల రూపంలో ఘరానా మోసం

నేటి కాలంలో మనం ఎన్నో రకాల మోసాలను చూస్తున్నాం. ఆర్థిక మోసాలు మొదలు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల వరకు చిత్రవిచిత్రమైన మోసాలు జరుగుతున్నాయి. అమెరికా, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో, వినడానికి విచిత్రంగా ఉన్న మరో మోసం వెలుగు చూసింది. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో నౌకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయగా, మరోవైపు అమెరికా దిగ్బంధిస్తోంది. ఈ క్రమంలో కొందరు దోపిడీదారులు అధికారుల వేషంలో అక్కడ నిలిచిపోయిన నౌకల వద్ద డబ్బు వసూలు చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీ చెల్లిస్తే దానికి బదులుగా నౌకలను హర్మూజ్ జలసంది దాటిస్తామని నమ్మబలుకుతున్నారు. దోపిడీదారుల తీరును గుర్తించిన గ్రీక్ మ్యారిటైమ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ 'మారిస్క్స్' నౌకల యజమానులకు హెచ్చరికలు జారీ చేసింది. తాము ఇరాన్ అధికారులమని, ఓడను హర్మూజ్ దాటిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని సూచించింది. క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్స్, టెథర్ రూపంలో చెల్లింపులు జరిపితే మీ నౌకలను హర్మూజ్ జలసంధి దాటిస్తామని ఈ దోపిడీదారులు నమ్మిస్తున్నారని, అలా అధికారుల వేషంలో వస్తే నమ్మవద్దని సూచించింది. ఇరాన్ అధికారులు ఇలాంటి అవకాశాలు కల్పించలేదని స్పష్టం చేసింది. ఇది కచ్చితంగా మోసగాళ్ళ పనే అని పేర్కొంది.

# మోదీని ఉగ్రవాది అనలేదు..

దర్యాప్తు సంస్థలతో సహా కీలకమైన వ్యవస్థలన్నీ రాజకీయ ఒత్తిడిలో పనిచేస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీ) కూడా స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, బీజేపీకి అనుబంధ కార్యాలయంలా మారిపోయిందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎప్పుడూ మద్దతు ఇస్తోందని పునరుద్ఘాటించారు. అయితే, ఈ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము బిల్లును కాదని, డీలిమిటేషన్‌ను తీసుకురావడాన్ని మాత్రమే వ్యతిరేకించామని తెలిపారు. ధనబలం, కండబలం, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు.

**ఇరాన్ హాజరుపై సందిగ్ధత** అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ, తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, అయితే తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది. ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు అమెరికా వర్గాలను ఉటంకిస్తూ ఏక్సియోస్ నివేదించింది.

**ఇరు దేశాల డిమాండ్లు, హెచ్చరికలు** ఈ చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు పెద్ద అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు కుప్పకూలకుండా చూసే ఒప్పందం కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇరాన్‌కు అణ్వాయుధాలు అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండకూడదని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు, యుద్ధాన్ని నివారించి, తమపై ఉన్న ఆంక్షలను సడలించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురుచూస్తోంది. కానీ, తమ అణు కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరించుకుంటున్నాయి. తమ షరతులను తిరస్కరిస్తే ఇరాన్‌లోని ప్రతి వంతెనను, పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా, అమెరికా తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని పవర్ స్టేషన్లు, డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ప్రతిస్పందించింది.

**ఇస్లామాబాద్‌లో భారీ ఏర్పాట్లు** మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఈ కీలక చర్చలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్ వ్యాప్తంగా దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.

# గంజాయి కొనడానికి డబ్బుల్లేక... హైదరాబాదులో ఇంటిపైనే పెంచుతున్న టెక్కీ!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి, గంజాయి కొనేందుకు డబ్బుల్లేక ఏకంగా ఇంటిపైన గంజాయి పండించడం మొదలుపెట్టాడో టెక్కీ. ఈ అనూహ్య ఘటన హైదరాబాద్‌లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం, నాచారం ఈస్ట్ గాంధీనగర్‌కు చెందిన సి. శశిధర్ అనే వ్యక్తి తన ఇంటి టెర్రస్‌పై గంజాయి సాగు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శశిధర్ ఇంటిపై దాడి చేసిన పోలీసులు, అక్కడ పదుల సంఖ్యలో గంజాయి మొక్కలు ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. టెర్రస్‌పై పెంచుతున్న 17 గంజాయి మొక్కలతో పాటు, సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన శశిధర్, ఆ తర్వాత ఉద్యోగం మానేశాడు. గంజాయికి అలవాటుపడిన అతనికి, కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో తానే స్వయంగా పండించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు శశిధర్‌ను అరెస్ట్ చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# భవన నిర్మాణదారులకు ఊరట

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణదారులకు, భూ యజమానులకు భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఖాళీ స్థలాలపై పన్ను చెల్లింపు విధానంలో సవరణలు చేస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన చట్ట సవరణలకు అనుగుణంగా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ అధికారిక జీవోను విడుదల చేశారు. దీని ప్రకారం భవన నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన ఖాళీ స్థలం పన్నుపై 50 శాతం రాయితీ లభించనుంది. భవన నిర్మాణ అనుమతి పొంది, నిర్మాణం ప్రారంభించిన సమయం నుంచి ఆ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ అయ్యే వరకు ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుంది. గతంలో నిర్మాణం జరుగుతున్న సమయంలో కూడా పూర్తి స్థాయిలో పన్ను చెల్లించాల్సి వచ్చేది, ఇప్పుడు ఆ భారాన్ని ప్రభుత్వం సగానికి తగ్గించింది. మున్సిపల్ చట్టాల్లోని నిబంధనల వల్ల నిర్మాణదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి, సామాన్యులపై భారం తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు చట్ట సవరణ బిల్లును ఆమోదించారు. పెద్ద ప్రాజెక్టులు నిర్మించే సమయంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రావడానికి ఏళ్ల సమయం పడుతుంది. అప్పటివరకు ఖాళీ స్థలం పన్ను భారం సగానికి తగ్గడం వల్ల ప్రాజెక్టు వ్యయం తగ్గుతుంది. వ్యక్తిగత గృహ నిర్మాణదారులకు కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ నిర్ణయం వల్ల భవన నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. నిర్మాణ అనుమతి పొందిన తర్వాత మాత్రమే ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుంది. కేవలం ఖాళీగా ఉంచిన స్థలాలకు (నిర్మాణ అనుమతి లేనివి) యథావిధిగా పూర్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత, ఆ స్థలం పన్ను రద్దయి, భవన పన్ను అమల్లోకి వస్తుంది. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నిర్మాణ రంగ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు

కాకినాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సంబంధించిన కాకినాడలోని అపార్ట్‌మెంట్‌లో పోలీసులు మంగళవారం ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. ముగ్గురు సీఐల బృందం అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ పరిణామం డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుతో సంబంధం ఉన్నదిగా తెలుస్తోంది. సాక్ష్యాల ఆధారంగా ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, పోలీసులు చేరుకునే సమయానికి అనంతబాబు అక్కడ లేకపోవడం గమనార్హం. పోలీసులు వస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకొని ఆయన పరార్ అయినట్లు తెలుస్తోంది. అనంతబాబు కోసం పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రభావితం చేయడానికి అనంతబాబు ప్రయత్నించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సాక్షుల నుంచి సేకరించిన సమాచారం, ఆధారాల ఆధారంగా పోలీసులు ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 2022 మే 19వ తేదీన వీధి సుబ్రహ్మణ్యం హత్య ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అదే రోజు అనంతబాబు పుట్టిన రోజు కావడం కూడా కేసుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. సుబ్రహ్మణ్యం హత్య జరిగిన రోజున రాత్రి అనంతబాబు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. సుబ్రహ్మణ్యం గత ఆరు సంవత్సరాలుగా అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేశారు. తన వివాహం కోసం అనంతబాబు వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ సీసీటీవీ ఫుటేజ్, కాల్ రికార్డులు వంటి కీలక ఆధారాలను సిట్ సేకరించింది. దర్యాప్తులో భాగంగా, ఈ హత్యలో అనంతబాబు పాత్ర ఉందని సిట్ తేల్చినట్లు సమాచారం. అలాగే ఆయన భార్య అనంత లక్ష్మి దుర్గను ఈ కేసులో ఏ-2గా చేర్చడం కూడా కీలక పరిణామంగా మారింది.

# విదేశాల్లో ఇంతేనంటూ... బాయ్ ఫ్రెండ్ కళ్లకు గంతలు కట్టి నిప్పంటించిన యువతి

### ప్రపోజల్ పేరుతో ప్రియుడిని దారుణంగా హత్య చేసిన యువతి

### బెంగళూరులో జరిగిన ఈ ఘటనలో ప్రేరణ అనే యువతి అరెస్ట్

### కుర్చీకి కట్టేసి, నిప్పంటించి ప్రియుడు కిరణ్ ను సజీవదహనం

### నిర్లక్ష్యం చేస్తున్నాడనే కోపంతోనే ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడి

### విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితురాలు

బెంగళూరులో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లి ప్రపోజల్ అని నమ్మించి, ప్రియుడిని కుర్చీకి కట్టేసి, నిప్పంటించి సజీవదహనం చేసిందో యువతి. ఈ కిరాతక ఘటనలో కిరణ్ (27) అనే యువకుడు మృతి చెందగా, నిందితురాలైన అతని ప్రేయసి ప్రేరణ (27)ను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని ఒక టెలికాం స్టోర్‌లో పనిచేస్తున్న కిరణ్, ప్రేరణ గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే, ఇటీవల కిరణ్ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని, పెళ్లి చేసుకోడని ప్రేరణ భావించింది. దీంతో అతడిపై తీవ్రమైన కక్ష పెంచుకుంది. మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరణ్ ను పిలిపించింది. 'విదేశాల్లో ఇలాగే ప్రపోజ్ చేస్తారు' అని నమ్మించి, కిరణ్ కళ్లకు గంతలు కట్టి కుర్చీలో బంధించింది. ఆమె మాటలు నమ్మిన కిరణ్, ప్రపోజల్ కోసం ఎదురుచూస్తుండగా, ప్రేరణ అతనిపై మండే ద్రవాన్ని పోసి నిప్పంటించింది. కిరణ్ మంటల్లో కాలిపోతుండగా ఆమె చూస్తూ నిలబడింది. ఈ ఘటనలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రేరణను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది. "వారిద్దరూ ప్రేమలో ఉన్నారు. కానీ ఇటీవల అతను తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె భావించింది" అని డీసీపీ డి.ఎల్. నాగేశ్ తెలిపారు. ప్రేరణ తన తల్లి, సోదరుడితో కలిసి అంజనాపురలో నివసిస్తోంది. ఈ పథకం ప్రకారం జరిగిన హత్యపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# పవన్ గెలిస్తే ఇక్కడే షూటింగ్... ఫ్యామిలీ డ్రామాగా వస్తున్న 'పిఠాపురంలో... అలా మొదలైంది' చిత్రం



సీనియర్ నటుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పిఠాపురంలో... అలా మొదలైంది' అనే కుటుంబ కథా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. 'ప్రేయసిరావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాతలు మీడియా సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు. నిర్మాత దుండిగల్ల బాలకృష్ణ మాట్లాడుతూ, "మా దర్శకుడు జనసేన అభిమాని. పవన్ కల్యాణ్ గెలిస్తే పిఠాపురంలోనే సినిమా తీస్తానని మాట ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకుంటూ 75 శాతం షూటింగ్ అక్కడే పూర్తి చేశాం. సినిమా పేరులో పిఠాపురం ఉన్నప్పటికీ, ఇందులో ఎలాంటి రాజకీయ అంశాలు ఉండవు. ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రం" అని స్పష్టం చేశారు. మరో నిర్మాత, పిఠాపురం జర్నలిస్ట్ అయిన ఎఫ్. ఎం. మురళి మాట్లాడుతూ, తన ఇంట్లోనే షూటింగ్ జరగడం, దర్శకుడి పనితీరు నచ్చి తాను ఈ ప్రాజెక్టులో భాగమైనట్లు చెప్పారు. నిర్మాత ఆకుల సురేష్ పటేల్ మాట్లాడుతూ, రాజేంద్ర ప్రసాద్ తన పాత్రకు వంద శాతం న్యాయం చేశారని అన్నారు. ఇప్పటికే ప్రీమియర్ షోలు చూసిన ప్రేక్షకులు కంటతడి పెట్టుకున్నారని, మౌత్ టాక్‌తో సినిమా విజయం సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి ఈ చిత్రాన్ని నిర్మించారు. కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరపున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# నరేంద్ర మోదీపై ఖర్గే 'ఉగ్రవాది' వ్యాఖ్య...

ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన 'ఉగ్రవాది' వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదుల కోసం కన్నీరు కార్చి మన సైన్యం ధైర్యాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి భాష అలవాటైందని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దశాబ్దాల పాటు ఉగ్రవాదంతో దేశం రక్తమోడేలా కాంగ్రెస్ చేసిందని ఆరోపించారు. నరేంద్ర మోదీ హయాంలో ఉగ్రవాదుల పట్ల సానుకూల విధానం అంతమైందని, దీంతో కాంగ్రెస్ పార్టీ నిరాశలో ఉందని విమర్శించారు. 2016లో సర్జికల్ స్ట్రైక్స్, 2019లో బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి సందర్భాలలో కాంగ్రెస్ పదేపదే శత్రువుల కథనాలను ప్రచారం చేసిందని మండిపడ్డారు. మన సైన్యాన్ని ఆధారాలు అడిగిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. బీజేపీ సేవా రాజకీయాలను నమ్ముతుందని, దుర్భాషలను లేదా నిరాశను కాదని బండి సంజయ్ అన్నారు. ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీని టెర్రరిస్ట్ అని పేర్కొనడం సరికాదని, ఈ తీరు ఓటమిని అంగీకరించలేని నైరాశ్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ దాడికి మాత్రమే కాదని, భారత ప్రజాస్వామ్య ఆత్మదాడికి పాల్పడుతోందని అన్నారు.

# గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం..

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్కా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్కా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు. గోర్కా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు. అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్కాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# నంద్యాల మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి





**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 21 ( నంది పత్రిక )** రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . మంగళవారం నంద్యాల మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన రబీ సీజన్ 2025-26 జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్.కే) ద్వారా ప్రభుత్వం పారదర్శకంగా జొన్నల కొనుగోలు చేపడుతోందని తెలిపారు. దళారీల ప్రమేయం లేకుండా, మద్దతు ధర నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు ప్రభుత్వం ఈ రబీ సీజన్‌కు గాను ఈ క్రింది విధంగా మద్దతు ధరలను నిర్ణయించిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు హైబ్రిడ్ (మహేంద్ర రకం): రూ. 3,699/-, మల్దండి: రూ. 3,749/- ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల (తేమ శాతం 13% లోపు, చెడిపోయిన గింజలు 1% లోపు మొదలైనవి) ప్రకారం ఉన్న జొన్నలను మాత్రమే కొనుగోలు చేస్తారని అన్నారు . ఈ -పంట నమోదు మరియు ఈ - కెవైసీ పూర్తయిన రైతులు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు .పంట విక్రయించిన తర్వాత ఎఫ్.టిఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయబడతాయన్నారు. ఒక వేళ రైతులే స్వయంగా గొనె సంచులు, హమాలీ మరియు రవాణా ఏర్పాట్లు చేసుకుంటే, ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ మొత్తాన్ని కూడా రైతు ఖాతాలో అదనంగా చెల్లిస్తామన్నారు . రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయడానికి రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1967 కు లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 08514-294866 కు సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, ఎమ్మార్వోలు శ్రీ వాణి, శ్రీనివాసులు, ఎంపీడీవో సుగుణ శ్రీ, సివిల్ సప్లై రాజు నాయక్, మార్క్ఫెడ్ అధికారి అనూష,సివిల్ సప్లై అధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎమ్ఏఓ స్వప్నిక, నంద్యాల అగ్రికల్చర్ ఏవో ప్రసాద్, నంద్యాల, గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ లు మునగాల విశ్వనాథరెడ్డి , తులసీశ్వర్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు , అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.





## జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు 'స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహణ....

### ప్రజల భద్రతే లక్ష్యంగా విస్తృత తనిఖీలు..




**నంద్యాల క్రైం, ఏప్రిల్21(నంది పత్రిక):-** రోడ్డు ప్రమాదాలు నియంత్రించుటకు ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులలో స్టాప్ - వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించడంతో పాటు వాహనాలు తనిఖీ చేయాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ప్రైవేట్ వాహనాలు,ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే వాహనాలలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు మరియు సరైన భద్రతా చర్యలు,జాగ్రత్తలు పాటించాలని బస్సులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు నంద్యాల పోలీసులు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు జిల్లా రాత్రిపూట తిరిగే వాహనాలను ఆపి "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కడప నుండి నంద్యాల హైవే,కర్నూలు నుండి విజయవాడ వెళ్ళే వాహనాలు,నంద్యాల నుండి కర్నూలు ఎన్ హెచ్ 44 హైవే, కర్నూలు నుండి బెంగుళూరు వైపు వెళ్ళే వాహనాలు మరియు జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలలో ఈ "స్టాప్ - వాష్ అండ్ గో"కార్యాక్రమం నిర్వహించడం జరిగింది.అంతేకాక వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవర్‌ల లైసెన్సుల వంటి భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేస్తున్నారు. వాహనాలను అతి వేగంతో నడపకుండా, రాంగ్ రూట్ లో వెళ్ళకుండా, పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కించుకునే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా పోలీసులు తెలియజేశారు.



# ఎక్కడ గొంగళి అక్కడే.. ఆందోళనల పోరుమామిళ్ల ప్రజలు



### ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ గంగన్న, ఫణి రావు, ప్రవీణ్ ఆవేద

**పోరుమామిళ్ల ఏప్రిల్ 21 (నంది పత్రిక):**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలో "ఎక్కడ గొంగళి అక్కడే ఆందోళన" అన్నట్టుగా ప్రజలు రోజురోజుకూ నరకయాతన అనుభవిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అంబేద్కర్ సర్కిల్ నుండి వేణుగోపాల స్వామి ఆలయం వరకు కొనసాగుతున్న రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరి, ఆర్&బీ అధికారుల సోమరితనం కారణంగా పనులు నత్తనడకన సాగుతుండగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ కాలువలు త్రవ్వడం, డివైడర్లు సరిగా లేకపోవడం వల్ల రోడ్డు మీద ప్రయాణం కష్టంగా మారింది. డ్రైనేజీ కాలువల్లో మురికి నీరు పేరుకుపోవడం, షాపు యజమానులు చెత్త పారవేయడం వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వ్యాపారస్తులు దుర్వాసనతో పాటు వ్యాపార నష్టాలు చవిచూస్తున్నారు. డివైడర్లు చెత్తతో నిండిపోయి ఉండగా, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉండడం వల్ల ప్రమాదాల భయం నెలకొంది. దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు బాధపడుతున్నారు.

వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. అసంపూర్తి రోడ్డు, నాణ్యత లేని డ్రైనేజీ పనుల కారణంగా మురికి నీరు త్రాగునీటితో కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అంటు రోగాలు వ్యాపించే అవకాశముందని భయపడుతున్నారు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం మాత్రమే వస్తున్నారని, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.ఈ పరిస్థితులపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణిరావు, ఆఫీస్ సెక్రటరీ ప్రవీణ్, పూజిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులు అయిన ఆరోగ్యం, భద్రత, శుభ్రమైన వాతావరణం దెబ్బతింటున్నాయని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనగా మారిందని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని అత్యవసర పరిస్థితిగా భావించి పోరుమామిళ్ల నడిబొడ్డున ఉన్న ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల జీవన నాణ్యతను కాపాడేందుకు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పోరుమామిళ్ల ప్రజలు కోరుతున్నారు.



## జలమే జీవం - జల సంరక్షణే ధ్యేయం :

### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**నంది పత్రిక ఆత్మకూరు..**కరివేన చెరువు పంట కాలువ వద్ద " జలధార " కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఉపాధి హామీ కూలీలతో కలిసి పంట కాలువలో పూడికతీత, సాగునీటి కాలువలను శుభ్రం చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే జలధార ధ్యేయం..చెరువుల పునరుద్ధరణతో వర్షపునీటిని వడిసిపట్టి రైతులకు అందిస్తాం.. కాలువలు, చెక్ డ్యామ్ లలో పూడికతీత, మరమ్మత్తులతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యం..

## ఆస్తి పన్ను రాయితీలకు విశేష స్పందన

### నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ



**కర్నూలు నంది పత్రిక.......**ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన రాయితీలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ఏక మొత్తంలో చెల్లించేవారికి 5 శాతం రాయితీ లభించడం వల్ల పన్ను చెల్లింపుల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తున్నదని వివరించారు.ఇప్పటివరకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.13 కోట్ల వరకు వసూళ్లు నమోదైనట్లు తెలిపారు. నగర అభివృద్ధికి ఆస్తి పన్నులు కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పన్ను చెల్లింపుదారు ముందుకు వచ్చి తమ బకాయిలను ఈ నెల 30 లోపు చెల్లించడం ద్వారా నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించడానికి నగరపాలక కార్యాలయానికే రావాల్సిన అవసరం లేదని, సమీపంలోని ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సైతం చెల్లించవచ్చని అదనపు కమిషనర్ సూచించారు.

**ఎక్కడెక్కడ చెల్లించవచ్చంటే..** నగరపాలక సంస్థ నూతన, పాత కార్యాలయాలతో పాటు దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయాలు, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయాలు, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయాలు, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయాలు, లక్ష్మీనగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయి. సెలవు దినాలతో సహా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చెల్లించే అవకాశం ఉంది.

## "ట్రాన్స్ఫార్మింగ్ సస్టైనబిలిటీ విత్ ఏఐ-పవర్డ్ అప్లికేషన్స్" సర్టిఫికేషన్ కార్యక్రమం ప్రారంభం




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 21 . (నంది పత్రిక ):**నంద్యాలలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (ఆటోనమస్) ఆధ్వర్యంలో "ట్రాన్స్ఫార్మింగ్ సస్టైనబిలిటీ విత్ ఏఐ-పవర్డ్ అప్లికేషన్స్" అనే అంశంపై ఒక వారపు సర్టిఫికేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం 21-04-2026 నుండి 25-04-2026 తేదీలలో కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించబడుతోంది.ఈ కార్యక్రమాన్ని కళాశాల బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో, బ్రెయిన్-ఓ-విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మరియు ఎస్ఆర్ఈసీ ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్ వై. ప్రణీత్ బాబు మాట్లాడుతూ, "ట్రాన్స్ఫార్మింగ్ సస్టైనబిలిటీ విత్ ఏఐ-పవర్డ్ అప్లికేషన్స్" అంశం ప్రస్తుత కాలానికి ఎంతో ప్రాసంగికమని తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎస్డీజీస్) సమన్వయం ద్వారా సమాజ సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలు మరియు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగి, సమాజానికి ఉపయోగపడే యాప్స్ను రూపొందించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీన్ అకాడెమిక్స్ డా. బి. హారిత, తన ప్రసంగంలో మాట్లాడుతూ, "ట్రాన్స్ఫార్మింగ్ సస్టైనబిలిటీ విత్ ఏఐ-పవర్డ్ అప్లికేషన్స్" వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత మరియు సాంకేతిక నైపుణ్యాలను గణనీయంగా పెంపొందిస్తాయని తెలిపారు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల అకాడెమిక్ అభ్యాసాన్ని ప్రాయోగిక అనుభవంతో అనుసంధానిస్తూ, వారికి భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిస్తాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎస్డీజీస్) సమన్వయం ద్వారా సమాజ సమస్యలకు సుస్థిర పరిష్కారాలను అందించే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులను ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డా. ఎం. బాలతేజ, వి. స్వర్ణలత మరియు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (నంది పత్రిక):**మలేరియా నిర్మూలన ధ్యేయంగా "ఇప్పుడు మనం సాధించగలం, ఇప్పుడు మనం తప్పక సాధించాలి" అనే నినాదంతో పోరుమామిళ్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈనెల ఏప్రిల్ 25 వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా విద్యార్థినులకు మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి టి. నరసింహా రెడ్డి మాట్లాడుతూ.. మలేరియా అనేది ఆడ అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధి అని, దీని పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని వివరించారు:పరిసరాల పరిశుభ్రత: నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చు.ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం. వ్యక్తిగత జాగ్రత్తలు: రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, ఒంటి నిండా బట్టలు ధరించడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. త్వరిత చికిత్స: చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలని కోరారు.

**ప్రతిభ చాటిన విద్యార్థినులు:** 'మలేరియా నిర్మూలనలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నివారణ మార్గాలపై ప్రతిభ కనబరిచిన విజేతలు మొదటి బహుమతి, శాని, రెండవబహుమతి, రమ్య, మూడవబహుమతి వసిత,మాధవి, లకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో తమ గ్రామాల్లోని ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించి చైతన్యపరచాలని సబ్ యూనిట్ ఆఫీసర్, టి. నరసింహా రెడ్డి,కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్, సత్యనారాయణ, వెంకటరమణ, ఎం ఎల్ పి హెచ్ , ప్రియాంక,రాజేశ్వరి, ప్రిన్సిపల్, నాగమల్లేశ్వరి, వైస్, ప్రిన్సిపాల్, భాగ్యలక్ష్మి, సైన్స్ టీచర్, నజీమా, ఇంగ్లీష్ టీచర్, రెడ్డమ్మ, ఏఎన్ఎం , సులోచన రాణి,ఆశా కార్యకర్తలు పాఠశాల ఏఎన్ఎం, మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



# బాలికలకు హెచ్‌పీవీ టీకా గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణకు బంగారు అవకాశం



**బద్వేల్ ఏప్రిల్ 21 (నంది పత్రిక):**బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ ( హెచ్ పి వి ) వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. అర్హులైన బాలికలు తప్పనిసరిగా ఈ టీకాను తీసుకోవాలని, ఇది పూర్తిగా సురక్షితమైనదని తల్లిదండ్రులకు, విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా తోట్టి గారిపల్లె, సురేంద్ర నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా సుమారు 50 మంది బాలికలకు టీకాలు వేశారు. టీకా పొందిన లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి, వ్యాధి నిరోధక టీకా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. సుబ్బారెడ్డి (ప్రధానోపాధ్యాయులు), బి. వెంగయ్య (డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్), ఏ. రామయ్య (అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయులు), వి. జనార్ధన్ రావు (హెల్త్ అసిస్టెంట్), ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల నుంచి లక్షలు వసూలు చేసిన హెచ్‌ఎం విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలి: విద్యార్థి సంఘాలు



**ఉత్తమ ఉపాధ్యాయురాలా? లేక ఉత్తమ అవినీతి ఉపాధ్యాయురాలా? అవార్డు వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్ పిడిఎస్ యు -ఏఐఎస్ఎ-వైయస్సార్ ఎస్ యు-ఏఐఎఫ్ డి ఎస్-ఆర్ పి ఎస్ ఎఫ్ బీసీ సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ముందు ధర్నా**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఏపీజే అబ్దుల్ కలాం హైస్కూల్ మాజీ ఇంచార్జి హెచ్ఎం విజయలక్ష్మి విద్యార్థుల నుంచి అక్రమంగా లక్షలాది రూపాయలు వసూలు చేశారని, ఆమెను వెంటనే విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యు -ఏఐఎస్ఎ-వైయస్సార్ ఎస్ యు-ఏఐఎఫ్ డి ఎస్-ఆర్ పి ఎస్ ఎఫ్-బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, వైయస్సార్ ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి కటారు కొండ సాయి, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఏఐ ఎఫ్ డిఎస్ రాష్ట్ర కార్యదర్శి దక్క కుమార్, బీసీ సంఘం నాయకుడు గిరీష్ మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 8 సంవత్సరాల పాటు ఏపీజే అబ్దుల్ కలాం హైస్కూల్‌లో ఇంచార్జి హెడ్‌మాస్టర్‌గా పనిచేసిన విజయలక్ష్మి, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య అందించాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బెంచీలు, స్కూల్ మరమ్మత్తులు, ఇతర ఖర్చుల పేరుతో డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. అంతేకాకుండా, విద్యార్థులకు వచ్చే స్కాలర్‌షిప్‌లలోనూ ఒక సంవత్సరం మొత్తాన్ని పాఠశాలకు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధి పేరుతో తల్లిదండ్రుల నుంచి సుమారు 20 లక్షల నుంచి 30 లక్షల వరకు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపించారు. ఇలాంటి అవినీతికి పాల్పడిన వ్యక్తికి "ఉత్తమ ఉపాధ్యాయురాలు" అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ, ఆమెను "ఉత్తమ అవినీతి ఉపాధ్యాయురాలు"గా విమర్శించారు. వెంటనే ఆ అవార్డును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గతంలోనే ఈ అవినీతి వ్యవహారంపై సాక్ష్యాధారాలతో జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని వారు తీవ్రంగా ప్రశ్నించారు. అధికారులే ఆమెను వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విజయలక్ష్మిని తక్షణమే సస్పెండ్ చేసి, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకొని డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో అడ్డుకొని అవినీతి పాల్పడిన విజయలక్ష్మి పై సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ తప్పకుండా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎ నాయకులు సాయి పవన్, సూర్య, పి డి ఎస్ యు నాయకులు వీరేష్, అసలాం, కిరణ్, ఏఐ ఎఫ్ డి ఎస్ నాయకులు శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు...



# 2026 మే , 09 న అన్ని కోర్టు ప్రాంగణంలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును.



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు బుధవారం స్థానిక జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో వచ్చే నెల మే 09 న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ పై ఇన్సూరెన్స్, మున్సిపల్, ఫైనాన్స్ & చిట్ ఫండ్, బ్యాంక్ మేనేజర్స్, ఇన్సూరెన్స్ న్యాయ వాదులు,బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ ఆఫీసర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులు, మోటార్ ఆక్సిడెంట్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను, బ్యాంక్ డీఫాల్టర్ కేసులను,మున్సిపాలిటీ ప్రాపర్టీ టాక్స్ కేసులు,బియస్ యన్ఎల్ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్స్,పంచాయతీ ఆఫీసర్స్, మున్సిపాలిటీ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, బిఎస్ యన్ఎల్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలు"




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూల్,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక దూపాడు దగ్గర గల అశోక ఇంజనీరింగ్ కాలేజీ నందు ఏర్పాటుచేసిన ప్రపంచ ధరిత్రీ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నామని పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడమే ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఎన్విరాన్ మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎవరికైనా చట్టపరమైన సమస్యలు ఎదురైనప్పుడు లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీహెల్ప్ లైన్ నెంబర్ 15100 కి కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ పి.వి. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ఇప్పటికే ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి అని తెలిపారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగ్స్, పేపర్ బ్యాగ్స్ ఉపయోగించవచ్చు అని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవం నిర్వహించడం వల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుంది అని తెలిపారు. దీని వలన భూమిని కాపాడుకోవాలనే బాధ్యత పెరుగుతుందని ప్రభుత్వ సంస్థలు ప్రజలు కలిసి భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనే భావన పెంపొందుతుంది అని తెలిపారు. అనంతరం లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో భూమిని కాపాడుదామని ప్రతిజ్ఞను నిర్వహించారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం పై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జడ్జి చేతుల మీదుగా సర్టిఫికెట్లు మోమేంటోలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం అశోక ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ కిషోర్ రెడ్డి,కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ యన్.మగేశ్వరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ వెంకట సాయి కిషోర్, అనలిస్ట్ ఇమ్రాన్, రామకృష్ణ,పవన్, అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యన్. మగేశ్వరి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. ఎ. శివకుమార్, అడ్మినిస్ట్రేటర్ దావల్ ఈశ్వర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వలి, కాలేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల ఐక్యతే మన అభివృద్ధికి సోపానమం





**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** అనంతపురం జిల్లా వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం నందు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ కు మరియు డైరెక్టర్లకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అభినందన సభలో ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ మంత్రివర్యులు సవితమ్మ మరియు అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు బీసీ మంత్రి సవితమ్మ మాట్లాడుతూ వీర బ్రహ్మం చరిత్రను సూర్యచంద్రులు ఉన్నంతకాలం మరువలేమని ఎందుకంటే జరిగింది, జరగబోయేది, జరిగేది, చెప్పి కాలజ్ఞానాన్ని రచించిన వీరబ్రహ్మేంద్ర స్వామి వారసులు మీరంతా అని తెలియజేశారు మనమంతా బీసీ లము మన తెలుగు రాష్ట్రాలలో బీసీలకు స్వాతంత్రం వచ్చింది అన్న నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాతనే అని కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం మనందరం చూసాము మరి ఆయన ఆశలను కొనసాగిస్తున్న వ్యక్తి మన చంద్రబాబు నాయుడు గారు అని తెలియజేసినారు మరి చంద్రబాబు నాయుడు బీసీలను అక్కున చేర్చుకున్న వ్యక్తి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వ్యక్తి అందుకు నిధులు కేటాయించిన వ్యక్తి కూడా మన చంద్రన్ననే అని తెలియజేసినారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఎం. ఎస్. ఎం. ఈ లోన్ల గురించి ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్పొరేషన్ డైరెక్టర్ లపై ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఈ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేయడం ద్వారా మన కార్పొరేషన్ పై ప్రజలలో విశ్వాసం పెరుగుతుందని మరియు మే నెలలో జరగబోయే కుల గణన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచ వృత్తుల వారందరూ విశ్వబ్రాహ్మణ కులం కింద నమోదవ్వాలని పంచవృత్తుల జనాభా ఒక్కటేనని ప్రభుత్వానికి మన సంఖ్యను తెలియజేసి సంక్షేమ పథకాలలో అధిక మొత్తాన్ని మన విశ్వబ్రాహ్మణులు పొందాలని తెలియజేసినారు విశ్వబ్రాహ్మణుల ఐక్యతే మన అభివృద్ధికి సోపానమని రాష్ట్రంలో ఉన్న సంఘాలన్నీ ఏకీకృత సంఘం గా రాష్ట్ర ప్రభుత్వానికి మరియు కార్పోరేషన్ కి రిప్రజెంటేషన్ చేయడం ద్వారా మన జాతి అభివృద్ధి పథంలో నడుస్తుందని చైర్పర్సన్ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం లీగల్ సెల్ చైర్మన్, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ధర్మకర్తలు పి. గురు ప్రసాద్ , ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రాష్ట్ర బీసీ సంఘం నాయకులు ఎస్ ఆర్ నాగభూషణం , ఏసిపి కిరణ్ కుమార్ , ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లందరూ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది...



# వెలుగు సమాఖ్యలో పొదుపు మహిళల కీచులాట





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 21:** బ్యాంకు ద్వారా రుణం పొందిన మహిళలు, ప్రతినెల పొదుపు సొమ్మును సంబంధించిన గ్రూపు లీడర్ కు ఇస్తూ ఉన్నారు. అయితే తాము చెల్లించిన పొదుపు లీడర్ మింగేస్తున్న విషయాన్ని సదరు మహిళా సభ్యులు గుర్తించలేకపోయారు. తిరిగి రుణాన్ని పొందేందుకు బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే తాము తీసుకున్న రుణం ఇంకా పెండింగ్లో ఉందని చెప్పడంతో మహిళా సభ్యులు విస్తుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంఘటనకు సంబంధించి వెలుగు సమాఖ్య, మహిళా సభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామానికి చెందిన కీర్తి మహిళా సంఘానికి సంబంధించి ఒక్కొక్క మహిళా సభ్యురాలికి 2023 సంవత్సరంలో 60 వేల రూపాయల చొప్పున బ్యాంకు అధికారులు రుణాన్ని మంజూరు చేశారు. తీసుకున్న రుణాన్ని మహిళా సభ్యులంతా ప్రతినెల గ్రూపు లీడర్ కు ఇస్తూ వస్తున్నారు. గత మూడేళ్లుగా తాము తీసుకున్న రుణం పూర్తయింది అని తెలుసుకున్న మహిళలు కొత్తగా రుణాన్ని పొందినందుకు బ్యాంక్ అధికారులను సంప్రదించారు. కీర్తి గ్రూపుకు సంబంధించి ఇంకా లక్షా 50 వేల రూపాయలు బాకీ ఉందని బ్యాంకు అధికారులు చెప్పడంతో మహిళా సభ్యులు ఆందోళనలో పడిపోయారు. గ్రూపు సంబంధించి తాము మొత్తం సొమ్మును చెల్లించడం జరిగిందని, బాకీ ఉండటం ఏమిటని మహిళలు తోటి సంఘం లీడర్ ను ప్రశ్నించారు. ఈ విషయంపై పొదుపు మహిళలు గ్రూప్ లీడర్ తో వాగ్వాదానికి దిగారు. బ్యాంకులో 9 నెలలకు సంబంధించిన సొమ్ము విషయంపై సదరు గ్రూపుకు చెందిన రాణమ్మ,జ్యోతి, వసంతలు మంగళవారం బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో గ్రూపు లీడర్ పై ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వెంటనే ఎస్ఐ జగన్మోహన్ వెలుగు సమాఖ్య సిసి వెంకటస్వామిని పిలిపించి విచారించారు. సదరు గ్రూప్ లీడర్ పై తోటి మహిళలు ఫిర్యాదు చేస్తే తాను కేసు నమోదు చేస్తానని ఎస్ఐ సీసీ తో పాటు మహిళలతో పేర్కొన్నారు. ఈ విషయంపై పొదుపు మహిళలతో పాటు సిసి తర్జనభర్జన పడిపోయి పోలీస్ స్టేషన్ నుండి బయటికి వచ్చారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే మహిళలందరూ గ్రూప్ లీడర్ పై వాగ్వాదానికి దిగారు. నా పైన కేసు పెడతారా అంటూ గ్రూప్ లీడర్ తోటి మహిళా సభ్యులపై వీరంగం సృష్టించింది. ఈ విషయంపై జోక్యం చేసుకున్న సిసి వెంకటస్వామి గ్రూపు లీడర్ తో పాటు మహిళలందరినీ వెలుగు సమాఖ్య కార్యాలయానికి తీసుకొని వెళ్లారు. అక్కడ కూడా ఇదే విషయంపై మహిళలు గ్రూప్ లీడర్ వాదోపవాదాలు చెలరేగాయి. అయితే బ్యాంకులో బకాయి పడ్డ లక్ష 50వేల రూపాయల సొమ్మును ఎవరు చెల్లించాలన్న విషయంపై కూడా చర్చ జరిగింది. గ్రూపుకి ఇచ్చిన మొత్తం రెండు లక్షల 70 వేల రూపాయలు తాను నాలుగు నెలల సొమ్మును వాడుకోవడం జరిగిందని ఆ సొమ్మును రెండు నెలల కిందటే లక్ష ఇరవై వేల సొమ్మును జమ చేయడం జరిగిందని గ్రూప్ లీడర్ సమాఖ్యలో పేర్కొనడం జరిగింది. మిగతా 1,50,000 సొమ్ము నాకు సంబంధం లేదని, నేను చెల్లించనని సదరు లీడర్ ఖ రాకండిగా చెప్పేసింది. అయితే ఈ సొమ్మును ఎవరు చెల్లించాలి అంటూ మహిళలంతా తల పట్టుకొని కూర్చున్నారు. గ్రూపుకు సంబంధించి ఆమె లీడర్ కాబట్టి, ఆమెపై కేసు పెడదామని వెలుగు అధికారులు పేర్కొనడంతో సదరు లీడర్ వారిపై ఆగ్రహించినట్లుగా తెలుస్తోంది. నాపై మీరు కేసు పెడితే ఇక్కడే మందు తాగి మీ అందరిపై కేసులు పెడతానని సదరు లీడర్ గట్టిగా కేకలు వేయడంతో వెలుగు సమాఖ్య అధికారులతో పాటు తోటి మహిళా సభ్యులు హడలిపోయారు. అయితే ఈ విషయంపై గ్రామాన్ని సందర్శించి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని సీసీ వెంకటస్వామి పేర్కొన్నారు.

**పర్యవేక్షణ లోపం** పొదుపు మహిళా సంఘాల నిర్వహణ విషయంలో వెలుగు సమాఖ్య అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లుగా కనబడుతూ ఉంది. ప్రతినెల గ్రామాలను సందర్శించి పొదుపు సంఘాల నిర్వహణను, ప్రగతిని పర్యవేక్షించాల్సిన వెలుగు అధికారులు నాలుగు గోడలకే పరిమితమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని, కష్టపడి సంపాదించిన సొమ్మును గ్రూపు లీడర్లకు చెల్లిస్తే వారు వాడుకున్నామని బహిరంగంగా చెప్పడాన్ని బట్టి చూస్తే, ఇందులో అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతూ ఉందని పొదుపు మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొదుపు సంఘాల నిర్వహణకు గాను ప్రత్యేకంగా గ్రామాలలో బుక్కు కీపర్ లను నియమం చేయడం జరిగింది. వీరికి ప్రతినెలా వెలుగు సమాఖ్య అధికారులు పదివేల రూపాయల జీతాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బుక్కు కీపర్ పది 20 గ్రూపుల ను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతినెల సంఘములో సభ్యులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాన్ని చెల్లిస్తున్నారా లేదా? అన్న విషయాలను పరిశీలించాల్సి ఉంటుంది. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను త్వరగా చెల్లించి కొ త్త రుణాలను పొందేలా వారిని ప్రోత్సహించాల్సి ఉంటుంది. విచిత్రం ఏమిటంటే నారాయణపురం గ్రామంలో మహిళా ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఓ పురుషుడే బుక్ కీపర్ గా పనిచేస్తూ ఉండటం విచిత్రంగాను వింత గాను ఉంది. మహిళ బుక్ కీపర్ కాకుండా పురుషుడిని కీపర్ గా నియమించడం ఏమిటని వెలుగు అధికారులను ప్రశ్నిస్తే అది అంతేనంటూ చెప్పడం అధికారుల అలసత్వ వైఖరిని తెలియజేస్తూ ఉంది. గ్రామాలలో చాలా పొదుపు సంఘాలలో ఇలాంటి ఘటనలు సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ బయటికి రావడం లేదు. తరచూ వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఉత్తుత్తి సమావేశాలతో అధికారులు పొదుపుచ్చుతున్నారు. అధికారుల పనితీరు అంత వస్థినమ్మ, పోతినమ్మ అనే విధంగా తయారయింది.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**జొన్నగిరి గోల్డ్ మైన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పత్తికొండ ఆర్డీఓ ను ఆదేశించారు.మంగళవారం తుగ్గలి మండలం లోని జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ జొన్నగిరి గోల్డ్ మైన్స్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్లాంట్ లో ప్రారంభ దశ నుండి బంగారం ఉత్పత్తి అయ్యే చివరి దశ వరకు ఉన్న ప్రతి ఒక్క విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా ప్లాంట్ మొత్తం తిరిగి పరిశీలించారు.. సందర్శన అనంతరం పరిశ్రమల శాఖ, ఏపీ ఎల్ ఎల్ సి జెడ్ ఎం లతో, సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పత్తికొండ ఆర్డీవో, తుగ్గలి తహాశీల్దార్ లను ఆదేశించారు.కార్యక్రమంలో ఇంచార్జి పత్తికొండ ఆర్డీఓ మరియు ఏపీ ఎల్ సి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జవహర్, తుగ్గలి తహాశీల్దార్ రవి కుమార్ , సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## విశేష స్పందన లభిస్తున్న దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ చలివేంద్రం.



**సిరివెళ్ల.(నంది పత్రిక)** సిరివెళ్ల మెట్ట మీద దాదాపుగా సుమారు నెలరోజుల నుండి ప్రయాణికులు ఆటో కార్మికులు, హమాలి వర్కర్లు, తదితర ప్రజల దాహార్తిని తీరుస్తూ ఉన్నది. చలువ నీటి శుద్ధ జలాన్ని ప్రతిరోజు దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షులు అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి చలివేంద్రానిఏర్పాటు చేసి ఉన్నారు. శుద్ధ జలం వల్ల ఎంతోమంది గొంతు తడుస్తున్నదని ప్రస్తుతం స్తుతిమించిన ఎండల కారణంగా అన్నం కంటే నీరు మిన్న అన్నట్లు పరిస్థితి ఎదురవుతున్నదని ప్రయాణికులు తెలియజేశారు. దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి శుద్ధ జల చలివేంద్రం నిర్విరామంగా దిగ్విజయంగా కొనసాగడం గొప్ప విషయమని ప్రయాణికులు అన్నారు. ఆర్టీసీ బస్సులు ఏసీలో ప్రయాణిస్తున్న కారులో ఉన్న ప్రయాణికులు ఆటో డ్రైవర్లు, ప్యాసింజర్లు, లారీ డ్రైవర్లు క్లీనర్లు, చిరు వ్యాపారులు, తదితరులకు ఈ చలివేంద్రం ఎంతగానో దోహదపడుతున్నదని వడదెబ్బ తగలకుండా అందుబాటులో చలువ నీటిని ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఏ. నాగమల్లేశ్వర రెడ్డికి మరియు దాన ధర్మా చారిటబుల్ ట్రస్టు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## క్రిస్టియన్ స్థలాన్ని పోలీసు అధికారి దౌర్జన్యంగా కబ్జా

### ప్రతాప్ రెడ్డి, కర్నూలు డయాసిస్ సాంఘిక సేవా సంస్థ నిర్వాహకులు.



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** కర్నూలు డయాసిస్ సాంఘిక సేవా సంస్థకు చెందిన క్రిస్టియన్ స్థలాన్ని పోలీసు అధికారి దౌర్జన్యంగా కబ్జా చేశారంటూ ఆ సంస్థకు చెందిన క్రైస్తవులు, ఫాదర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. డయాసిస్ చెందిన 40 సెంట్ల స్థలంలో దౌర్జన్యంగా జెసిబి తో గోడ కూల్చి కబ్జాలకు పాల్పడుతున్నారని కర్నూలు డయాసిస్ కు చెందిన సీనియర్ ఫాదర్ ప్రతాపరెడ్డి ఆరోపించారు. కర్నూలు టూ టౌన్ చెందిన సీఐ శ్రీధర్ అతని బంధువులు ఈ చర్యలకు పాల్పడుతున్నారని తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని, తమ స్థలాన్ని కాపాడాలంటూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. సిఐ పై చర్యలు తీసుకోకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి తమ స్థలాన్ని కాపాడుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫాదర్లు డేవిడ్ అర్లప్ప, చిన్నప్పరెడ్డి, తోట జోసఫ్, ఆవేదన వ్యక్తం చేశారు.



# జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి



### ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేయాలి

### ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి నమూనాలను పరీక్షించడంతో పాటు ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పత్తికొండ మండలం కొత్తపల్లి గ్రామంలోని పందికోన రిజర్వాయర్ నుండి త్రాగు నీటిని ఫిల్టర్ చేసే మైక్రో ఫిల్టర్ పంప్ హౌస్, గ్యాస్ క్లోరినేషన్ కేంద్రాలలో త్రాగునీటి శుద్ధి ప్రక్రియను, వాటర్ శాంపిల్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా త్రాగు నీటిని ఫిల్టర్ చేసే మైక్రో ఫిల్టర్ పంప్ హౌస్, గ్యాస్ క్లోరినేషన్ కేంద్రాలను పరిశీలిస్తూ వాటి నిర్వహణ ఏ విధంగా ఉంది, ఏమైనా మరమ్మతులు ఉన్నాయా అని పరిశీలించారు. రోజుకు ఎంత మేరకు నీటిని ఫిల్టర్ చేస్తారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ పరీక్ష ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఇసుక ఫిల్టర్లు ఉపయోగించి, కార్బన్ సహాయంతో మలినాలను తొలగించి, సెడిమెంటేషన్ ప్రక్రియ తర్వాత క్లోరినేషన్ చేసి గ్రామాలకు మరియు ట్యాంకులకు నీటిని సరఫరా చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన తాగునీటిని అందించేలా వ్యవస్థను మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా ముందుగానే అప్రమత్తమై, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పత్తికొండ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న =ఓూ= ట్యాంక్ ను కలెక్టర్ పరిశీలిస్తూ ట్యాంక్ నిర్వహణ విధానాలను, నీటి నాణ్యతను తనిఖీ చేశారు. నీటిలో క్లోరిన్ స్థాయిలను పరీక్షిస్తున్న విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తూ, శుద్ధి ప్రక్రియ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి నమూనాలను పరీక్షించాలని (వాటర్ శాంపిల్ టెస్టింగ్) మరియు క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయించాలని కలెక్టర్ =ఔూ అధికారులను ఆదేశించారు ట్యాంక్ ను క్లోరినేషన్ చేసిన తేదీ, శుభ్రపరచిన తేదీ వివరాలను ఖచ్చితంగా రాయాలన్నారు.



అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 33 జూఔ (సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా) పథకాలు, 800 ూఔ (రక్షిత మంచినీటి సరఫరా) పథకాలు మరియు 1200 మినీ ూఔ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు దాదాపు 300 బోర్ వెల్స్ మరియు 1000 హ్యాండ్ పంప్స్ (చేతి పంపులు) ఉన్నాయన్నారు. ూణూ పథకం కింద 53 పనులకు మంజూరు లభించిందని, వీటిని త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ మందికి ఉపయోగపడే పనులను గుర్తించడం జరిగిందని, ఇందుకోసం కుడా నిధుల నుండి దాదాపు రూ. 3.5 కోట్ల నుండి 4 కోట్ల రూపాయలను కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. దీజ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ మరియు అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో త్రాగునీరు మరియు టాయిలెట్ సమస్యల పరిష్కారం కోసం 2.3 కోట్ల రూపాయలు మంజూరు చేసి, సంబంధిత పనులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పందికోన రిజర్వాయర్ ను పరిశీలించారు.. నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం నీటి స్థాయి గురించి కలెక్టర్ అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలి



### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**పాఠశాలల్లో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం తుగ్గలి మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్, బోరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ మరియు బోర్‌వెల్ వ్యవస్థలను తనిఖీ చేసి, విద్యార్థినులకు సరిపడా శుద్ధమైన తాగునీరు అందుతున్నదా అనే అంశంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వ, సరఫరా విధానం, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వసతి గృహంలో విద్యార్థినులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, భోజన సదుపాయాలు, నివాస గదుల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.కొద్ది రోజుల క్రితం ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేస్తున్న సమయంలో ఆశ్రమంలో తాగునీటి సమస్య ఉన్న విషయాన్నికలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామని, దీనిపై కలెక్టర్ స్పందించి వారి ఆదేశాల మేరకు ప్రస్తుతం వాటర్ ట్యాంక్‌తో పాటు ఆర్.ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చామని, దీంతో విద్యార్థినులకు శుద్ధమైన తాగునీరు నిరంతరం అందుతున్నదని అధ్యాపకులు కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తికొండ ఇంచార్జి ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పిఆర్టియూ మహా ధర్నా




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 21 . (నంది పత్రిక ):**ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, ఆంధ్ర ప్రదేశ్ సంఘం పిలుపు మేరకు నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం పిఆర్టియూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై రాంపక్కి రెడ్డి ల అధ్వర్యంలో మహా ధర్నాను చేపట్టారు.వెయ్యి మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.అధికారంలో వచ్చాక ఉద్యోగ , ఉపాధ్యాయులకు మెరుగైన పిఅర్సి, ఐఆర్, పెండింగ్ డిఎ లు వంటి అంశాలపై హామీ ఇచ్చిన ఇంత వరకు నెరవేర్చకపోవడం శోచనీయం అని వెంటేనే పిఅర్సి కమిషన్ ఏర్పాటు చేసి, 30% ఐఆర్ చెల్లిస్తూ పెండింగ్ డిఎ లు విడుదల చేయాలని కోరారు.

పిఅర్టియూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన పాలకుల నిర్లక్ష్యం ఉద్యోగ, ఉపాధ్యాయుల పై అలాగే కొనసాగుతుందని, దీనిని అడ్డుకుంటామని, సిపిఎస్ రద్దు చేయాలని, 2003 డిఎస్సి వారికి పాత పెన్షన్ వర్తింపు చేయాలి, మెమో 57 అమలు పరచాలని, 2022 నుంచి పెండింగ్ లో వున్న సరెండర్ లీవ్ చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై రాంపక్కి రెడ్డి మాట్లాడుతూ అనేక ఆశలతో ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, 2 సంవత్సరాలైన మన ప్రధాన డిమాండ్లను పెండింగ్ లో పెట్టడం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా ఉందని, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు అన్ని చెల్లించాలని, రిటైర్ అవుతున్న ఉపాధ్యాయులకు వారి పదవీ విరమణ రోజే వారి చెందాల్సిన ప్రయోజనాలు చెల్లించాలని, ఏమ్టిఎస్ ఉపాధ్యాయులైన డిఎస్సి 1998,2008 వారిని రెగ్యులర్ చేయాలి , వారికి 12నెలల జీతం చెల్లించాలి అని కోరారు.అలాగే ఎయిడెడ్, మున్సిపల్, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి అని కోరారు.చాలా పెద్ద ఎత్తున ఎండ వేడి లెక్క చేయకుండా ఉపాధ్యాయులు నిరసన గళం ఎత్తారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ 25 తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ కి ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో పిఅర్టియూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ భార్గవ రామయ్య,రాష్ట్ర నాయకులు కె కృష్ణారావు, గోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, విజయ్ రావు, ఇబ్రహీం, రాంపుల్ల రెడ్డి, మధుసూదన్, వై.వి.రమణయ్య, పి నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, హనుమంతు, రవీంద్ర రెడ్డి, జాకీర్ కె శ్రీనివాసులు , ఎస్ ఎమ్ బాషా, జేసీ నరసింహులు, సుమియన్, జగదీశ్ బాబు, సుధాకర్ రెడ్డి జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులుమహిళా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రుద్రవరంలో ఘనంగా పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర ఉత్సవాలు





**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 21 (నంది పత్రిక):**రుద్రవరం గ్రామంలో సుమారు తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, గ్రామ దేవతల ఆశీస్సుల కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఉత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దలు, కులవృత్తుల వారు కలిసి కుమ్మరి వారి ఇంటి నుండి అమ్మవారి విగ్రహాలను డప్పు వాయిద్యాలు, మంగళవాయిద్యాల మధ్య కోలాహలంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. గ్రామ వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్ర అనంతరం విగ్రహాలను పెద్దమ్మ స్వామి ఆలయం వద్ద ప్రతిష్టించారు. పెద్దమ్మ తల్లి జాతర అంటేనే భక్తి మరియు సంస్కృతుల కలయిక. ఈ జాతరలో ప్రధానంగా మహిళలు పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను తలకెత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పిచారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి గొర్రెలు, మేకలను బలి ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే ఘటాలను గ్రామం మొత్తం ఊరేగిస్తూ శాంతి పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్కభజనలు, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవర ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోని ఇరు ప్రధాన పార్టీల పెద్దలు, కీలక నాయకులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ నిరంతర సరఫరాను పర్యవేక్షించారు.భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందించారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. తొమ్మిదేళ్ల తర్వాత జరుగుతున్న ఉత్సవం కావడంతో రుద్రవరం గ్రామస్తులందరూ కులమతాలకు అతీతంగా ఏకమై పండుగను జరుపుకుంటున్నారు. ప్రతి ఇంటికి బంధుమిత్రులు రావడంతో ఊరంతా కోలాహలంగా మారింది.



# చైన్ స్నాచింగ్ చేసిన ఇద్దరిలో ఒకరి అరెస్ట్,



## పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం...

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఏప్రిల్ తొమ్మిదో తారీఖు రాత్రి 8 గంటలకు గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని సాయినాథ్ నగర్ లో ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటి బయట నడుస్తున్నటువంటి ఒక వివాహిత మెడలో నుంచి హెల్మెట్లు ధరించి జెర్కిన్ లు ధరించి ఒక నల్లటి మోటార్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు మగ వ్యక్తులు సదరు వివాహిత మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని హైవే వైపు వెళ్లినట్లుగా వచ్చిన ఫిర్యాదు పై క్రైం నెంబర్ 88/2026 గా కేసు నమోదు పరుచుకొనగా అదే రోజు సుమారు 10 గంటల సమయంలో సంతోష్ నగర్ లోని నాగమణి అనే వృద్ధురాలు ఇంటి బయట కూర్చుని ఉండగా హెల్మెట్ లు ధరించినటువంటి ఇద్దరు మగ వ్యక్తులు ఆమెను సమీపించినట్టు అందులో ఒక వ్యక్తి ఆమెను పట్టుకొని కత్తి చూపించి బంగారు గొలుసు లాక్కొని పారిపోతున్న సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయగా తన బంధువులు అయినటువంటి కొడుకు మరియు మనవడు

వెంటనే బయటకు వచ్చి గట్టిగా కేకలు వేగా అది గమనించిన ఆ ఇద్దరు దొంగలు వారి మోటార్ సైకిల్ లో ఎక్కి హైవే వైపుగా వెళుతూ ఉండగా అందులో నాగమణి యొక్క మనవడు వారిని సమీపించి పట్టుకోడానికి ప్రయత్నించిగా మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో ఇద్దరు కొద్దీ దూరం వెళ్లి మోటార్ సైకిల్ నుండి కింద కి దూకి అక్కడి నుండి తలో దిక్కు పారిపోవడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీస్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించి, సంఘటనా స్థలం లో దొరికిన మోటార్ సైకిల్, ఒక చిన్న కీ పాడ్ ఫోన్, మరియు వారి బ్యాగ్ లను స్వాదీనం చేసుకొని, సదరు ఘటనపై కేసు నమోదు పరచి, శ్రీయూత కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ వారి పర్యవేక్షణలో ధర్యాప్తు ప్రారంభించి, టెక్నికల్ ఆధారాల సహాయంతో దొంగలు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రము లోని షాంలి జిల్లా కి చెందిన భవారియా గాంగ్ లోని మానవ్ మరియు హరి ప్రకాష్ లు గా గుర్తించి అందులో ఒకరైన మానవ్ ని ఈరోజున బాలాజీ నగర్ నందు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి దొంగలించుకున్న చైన్ లలోని ఒక 2 గ్రాముల బంగారు గొలుసు ముక్కను సీజ్ చేసి రిమాండ్ కి పంపడం జరిగింది... అయితే ఈ నెల 7 వ తారీఖున వీరు ఇద్దరు కలిసి బెంగుళూరు వచ్చి, అటు నుండి అనంతపురం వచ్చి కొవ్వూరు నగర్ లో ఞా39 జీూ 2653 అను నెంబర్ కల్గిన పల్సర్ మోటార్ సైకిల్ ను దొంగలించుకొని కర్నూల్ నందు చైన్ స్నాచింగ్ కి పాల్పడినట్టుగా తెలుస్తోంది...మరో ముద్దాయి అయిన హరి ప్రకాష్ గురించి ప్రత్యేక బృందాన్ని పంపించడం జరిగింది. వీరి పై బెంగుళూరు మరియు చుట్టూ పక్కల ప్రాంతాలలో 16 కి పైగా కేసులు గలవు. అదే విధంగా హర్యానా, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ లలో కూడా 15 కి పైగా దొంగతనం కేసులు గలవు....

# మేమెంతో మాకు అంత వాటా

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** మేమెంతో మాకు అంత వాటా కావాలని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి డిమాండ్ చేశారు. పార్లమెంటులో మహిళా బిల్లు వీగిపోయిన సందర్భంగా కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేసిన ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక టీమ్. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపాదించిన 33% మహిళా రిజర్వేషన్ బిల్లు కేవలం ఆధిపత్య వర్గాల మహిళలకు మాత్రమే ప్రయోజనం కలుగుతుంది కానీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు ఎలాంటి ప్రయోజనం కలగదని ఆమె అన్నారు. దేశ జనాభాలో వున్న మహిళల జనాభా ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు ప్రత్యేక కోట ఇవ్వాలని ఆమె తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ముందుగా వెనుకబడిన తరగతుల వారి జనాభా లెక్కలు తేల్చి ఆ తర్వాత భారతదేశంలోని మొత్తం జనాభాలో 50% పైగా ఉన్నటువంటి మహిళలకు 50% రిజర్వేషన్ ఇచ్చి దానిలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వాటా ప్రకారం మేము ఎంత మంది ఉన్నామో మాకు అంత వాటా రిజర్వేషన్ ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం బిల్లు తెస్తే బాగుంటుందని ఆమె అన్నారు. నిజంగా ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే మా వర్గాల జనాభా లెక్కలు తేల్చిన తర్వాతనే రిజర్వేషన్ బిల్లు గురించి ఆలోచన చేయాలని అని ఆమె అన్నారు. ఆధిపత్య కులాల మహిళలకు ఉపయోగపడే బిల్లు వీగిపోయినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆమె తెలిపారు.



# జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోలుకోవాలని పోరుమామిళ్లలో ప్రత్యేక పూజలు



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (నంది పత్రిక ):**వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న స్థానిక జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల జనసేన అధ్యక్షుడి సతీమణి శీలంశెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తిపూర్వకంగా ప్రత్యేక పూజలు చేసి ఆయనకు ఆరోగ్యం చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నగిరి రమణయ్య, బొల్లు వెంకటసుబ్బయ్య, ఎక్కులూరి సిద్దు తదితరులు పాల్గొన్నారు. జనసేన అధినేత ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని స్థానిక నాయకులు ఆకాంక్షించారు.

# కేఎంసీ లో 50 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం...

## ఎడి యంఇ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూల్ మెడికల్ కాలేజీలో 50 లక్షల రూపాయలతో ముఖ్యంగా ఎలక్ట్రిక్ఫికేషన్ మరియు ఫైర్ కు సంబంధించిన పనులను ఏపీఎంఇడిసి ద్వారా చేపట్టామని ఎడి యంఇ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో క్లినికల్ ఫ్యాకల్టీ రూమ్ ల యందు, నాన్ క్లినికల్ డిపార్ట్మెంట్ లలో లైట్లు, ఫ్యాన్స్, లెక్చరర్ గ్యాలరీలలో అవసరం ఉన్న చోట్ల ఏసీలు ఏర్పాటు చేస్తున్నాం అని తెలిపారు. అదేవిధంగా కాలేజీలో ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన అవసరమైన తప్పనిసరి పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# డిజిటలై జేషన్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలను అందిస్తుంది



**కల్లూరు నంది పత్రిక.....**ప్రభుత్వం డిఆర్డిఏ వెలుగు కార్యక్రమం మంగళవారం స్థానిక ఎంపీడీవో ఆఫీసు నందు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి గ్రామ సంఘం అసిస్టెంట్ లకు మొబైల్ ఫోన్ లను ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం డిఆర్డిఏ వెలుగు కార్యక్రమం లో వివో ఏ లకు వివిధ రకాలైన ఆన్లైన్ యాప్ ల ద్వారా వివిధ రకాలైన సేవలను అందించడానికి మంచి క్వాలిటీ సాంసంగ్ 5జి మొబైల్స్ ని అందించడం జరిగింది. ఆన్లైన్లో పొదుపు మహిళలకు రుణాలను ఈ యాప్ ద్వారా అప్డేట్ చేయడం మరియు శ్రీనిధి ఉన్నతి వంటి రుణాలను ల ద్వారా అందించడానికి ప్రత్యేకంగా రూపొందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజలకు సత్వర సేవలను అందించడానికి టెక్నాలజీ ఉపయోగం, డిజిటలై జేషన్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలను అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జిఎన్ఎస్ రెడ్డి , డైరెక్టర్ అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ రామాంజనేయులు , కల్లూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ శేఖర్ మండల నాయకులు మాదేశ్ ఏపిఎం భోగా పుష్పవతి, సీసీలు, లు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

# సింగవరంలో దాడి వ్యక్తికి రక్త గాయాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 21:** బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఒక దాడిలో మండ్ల విజయకుమార్ అనే వ్యక్తికి రక్త గాయాలయ్యాయని ఎస్సై జగన్మోహన్ తెలిపారు. సోమవారం రాత్రి మండల విజయకుమార్ తో పాటు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి హమాలీ కూలీల విషయంలో చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు వ్యక్తులు విజయకుమార్ వెంకటేశ్వర్లు వాదులా డుకుంటున్నారని వెంకటేశ్వర్లు తమ్ముడు నాగలింగంకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న నాగలింగం వెనుక ముందు ఆలోచించకుండా ఇనుపరాడ్డు తో వచ్చి విజయ్ కుమార్ తలపై గట్టిగా కొట్టడంతో విజయకుమార్ కు తలపై రక్త గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన పోలీసులు రాత్రికి రాత్రి సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. విజయ్ కుమార్ ను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్మోహన్ పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ బాలరామిరెడ్డి మృతి బాధాకరం :రవీంద్రారెడ్డి



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 21 (నంది పత్రిక ):**సీనియర్ జర్నలిస్ట్ బాలరామి రెడ్డి మృతి పట్ల బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి సంతాపం తెలిపారు. మంగళవారం ఆయన స్వగ్రామం వెంకటాపురం వెళ్లి బాలరామి రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. బాలరామి రెడ్డి గారు జర్నలిజం రంగానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. "ఎన్నో దశాబ్దాలుగా నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం, బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలిచారు. యువ జర్నలిస్టులకు మార్గదర్శకంగా నిలిచిన ఆయన లేని లోటు పాత్రికేయ లోకానికి తీరనిది" అని అన్నారు. బాలరామి రెడ్డి గారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.రవీంద్రారెడ్డి వెంట స్థానిక నాయకులు, పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

# పోషణ పక్వాడ కార్యక్రమం.



**రుద్రవరం ఏప్రిల్ 21 (నంది పత్రిక):** మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమం లో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రషీదా బేగం మాట్లాడుతూతల్లులకు జంక్ ఫుడ్ తినటం వాళ్ళ వచ్చే నష్టాలు, ఆరోగ్య సమస్యల గురించి వివరించడం జరిగింది. హెల్తీ ఫుడ్ తీసుకోవాలని తెలియజేయటం జరిగింది మరియూ పిల్లలకు 2సంవత్సరం లు నిండే సరికి మనిషి మెదడులో 80% అభివృద్ధి అవుతుంది అని ఈ సమయం లో పిల్లలకు ఆరోగ్య కరమైన ఆహారం అలవాటు చేయాలనీ. మొబైల్ వాడకం తగ్గించి బయటి ఆటలు ఆడు కునే లా చూసుకోవాలని. పిల్లలతో రోజు కొద్ది సేపు సమయం కేటాయించిపిల్లల ఆరోగ్యం పై అలవాట్ల పై శ్రద్ధ చూపాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ టీచర్స్ పద్మావతి,షాహినూర్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు త్వరగా చెల్లించండి.



**బేతంచెర్ల ఏప్రిల్ 21 ( నందిపత్రిక ).** ఇంటర్మీడియట్ మే నెలలో జరగబోయేటువంటి సప్లిమెంటరీ మరియు ఇంప్రూవ్మెంట్ పరీక్షలకు మొదటి సంవత్సరం మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్ష ఫీజును త్వరగా చెల్లించుకోవాలని, బేతంచర్ల మండలం గొర్మానుకొండ గ్రామము దగ్గరలో ఉన్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మరియా దాస్ తెలియజేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయినటువంటి విద్యార్థులు 600 రూపాయలు, మొదటి సంవత్సరము మరియు రెండవ సంవత్సరం కలిపి ఎన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయిన 1200 రూపాయలు చెల్లించాలని, మొదటి సంవత్సరం ఇంప్రూవ్మెంట్ వ్రాయాలనుకున్నటువంటి వాళ్ళు ఒక సబ్జెక్టుకి అయితే 760 రూపాయలు, రెండు సబ్జెక్టులకే 920 రూపాయలు, మూడు సబ్జెక్టులకైతే 1080 రూపాయలు, నాలుగు సబ్జెక్టులయితే 1240, ఐదు సబ్జెక్టులైతే 1400 చెల్లించాలని పరీక్ష ఫీజు చెల్లించుకోవడానికి చివరి తేదీ ఏప్రిల్ 27వ తేదీ కావున మార్చిలో పరీక్షలు రాసిన విద్యార్థులు మే నెలలో ఇంప్రూవ్మెంట్ మరియు సప్లిమెంటరీ కి ఫీజు చెల్లించుకోగలరని తెలియజేశారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు కూడా ఈ సంవత్సరం కొత్తగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టిన ఇంప్రూవ్మెంట్ విధానం ప్రకారం సెకండియర్ కి కూడా ఇంప్రూవ్మెంట్ రాసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగిందనిమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియా దాస్ తెలియజేశారు.

## ఆన్లైన్ పోర్టల్ ద్వారా తన వివరాలను స్వచ్ఛందంగా నమోదు చేసుకున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 21( నంది పత్రిక )** నంద్యాల గాంధీ చౌక్ లో ఉన్న తన నివాసం నందు జనగణన కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) ప్రక్రియలో ఆన్లైన్ పోర్టల్ ద్వారా తన వివరాలను స్వచ్ఛందంగా నమోదు చేసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్.. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను నంద్యాల తాసిల్దార్ శ్రీనివాసులు, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న వివరించారు అనంతరం మంత్రి ఫరూక్ స్వయంగా ఒవ.ఖెవఅంబం.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా వివరాలను నమోదు చేశారు . ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, పేదల అభ్యున్నతికి జనగణన కీలకమని తెలిపారు . దేశంలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి వ్యక్తి కూడా తమ కుటుంబ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, దేశ జనాభా లెక్కలు సక్రమంగా నమోదు కావడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనకు దోహదపడుతాయని, ప్రపంచ దేశాల్లో మన దేశ స్థానాన్ని సుస్థిరం చేయడానికి ఈ జనగణన కీలక పాత్ర పోషిస్తుందని కావున ప్రజలందరూ పెద్దఎత్తున జనగణనలో పాల్గొని దేశాభివృద్ధికి దృఢమైన పునాది వెయ్యాలన్నారు. ఈ నెల 30 వ తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని, మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియ కూడా చేపడతారని తెలియజేశారు.



## మహిళా రిజర్వేషన్ విషయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత విచారకరం




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో జరిగిన సమావేశం లో మహిళల రిజర్వేషన్ విషయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత విచారకరం మరియు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ షాలి దాదా గాంధీ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు సూచన మేరకు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లులో మైనారిటీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉండదని చెప్పడం సామాజిక న్యాయానికి తీవ్ర భంగం కలిగించే చర్యగా మేము భావిస్తున్నాము. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన నేపథ్యంలో మైనారిటీ మహిళలను ఈ విధంగా పక్కన పెట్టడం వివక్షతను మరింత బలపరచే ప్రమాదకర నిర్ణయం. ఇప్పటికే సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం వారి అభివృద్ధిని అడ్డుకుంటుంది. కాబట్టి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ తరఫున మేము ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మహిళల రిజర్వేషన్ చట్టంలో అన్ని వర్గాల మహిళలకుప్రత్యేకంగా మైనారిటీ మహిళలకుసముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము; సామాజిక న్యాయం, సమానత్వ సూత్రాలను కాపాడాలని మరియు వివక్షాత్మక విధానాలను వెంటనే ఉపసంహరించు కోవాలని ఖాజా హుస్సేన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ మాజీ అధ్యక్షుడు ఎండ్లూరి లాజరస్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్ హై, డిసిసి మాజీ కార్యదర్శి వెల్దుర్తి శేషయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

## ఏ ఏ హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలిలి -ఏఐవైఎఫ్



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు నగరంలో కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఏ ఏ హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి అందులో పని చేసిన యువకులకు వెంటనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏ ఏ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు నగర కార్యదర్శి బిషన్న లు మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ఏ ఏ హాస్పిటల్లో యాజమాన్ కేవీ గ్రూప్ అఫ్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ ద్వారా దాదాపు 18 మంది యువకులను సెక్యూరిటీ గార్డ్స్ గా, హౌస్ కీపింగ్ గా నియమించుకొని ఎనిమిది నెలలు పని చేయించుకుని వారికి జీతాలు ఇవ్వకపోవడంతో అందులో పనిచేసిన వర్కర్స్ ఏఐవైఎఫ్ సంప్రదించగా ఏఐవైఎఫ్ నాయకులు ఆ యువకులతో కలిసి కేవీ గ్రూప్ ఆఫ్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీని నిలదీయగా వారు మాకు హాస్పిటల్ యాజమాన్యం డబ్బులు ఇవ్వలేదని వారి దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించక హాస్పిటల్ యాజమాన్ వర్కర్స్ కి డబ్బులు ఇవ్వవలసిన మాట వాస్తవమేనని నాకు కొంత గడువు ఇస్తే డబ్బులు చెల్లిస్తానని వర్కర్స్కు హామీ ఇవ్వడం కాకుండా ఏప్రిల్ 15వ తేదీ లోపల పూర్తి అమౌంట్ చెల్లిస్తామని రాతపూర్వకంగా అగ్రిమెంట్ రాసి ఇచ్చిన ఏ ఏ హాస్పిటల్ యాజమాన్యం ఏప్రిల్ 21 వచ్చిన హాస్పిటల్ దగ్గరికి వెళ్ళిన వర్కర్స్ ఏ ఏ హాస్పిటల్ యాజమాన్యం కానీ అక్కడ పనిచేసే సిబ్బంది కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఏఐవైఎఫ్ గా ఆందోళన చేస్తా ఉన్నామని ఏఏ హాస్పిటల్ యాజమాన్యం వర్కర్ జీతాలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు, డబ్బుల కోసం వర్కర్ వేధించే హాస్పిటల్ యాజమాన్యం పేషంట్ల విషయంలో ఏ విధంగా ప్రవర్తిస్తుందో అర్థమవుతుందని ఇలాంటి హాస్పిటల్ గుర్తింపును రద్దుచేసి ప్రజల ప్రాణాలు కాపాడడంతోపాటు హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు హాస్పిటల్ యాజమాన్యం స్పందించకపోతే ఈ అంశంపై లేబర్ కమిషనర్ దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనిచేసిన వర్కర్స్ కి న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నగర నాయకులు శ్రీకాంత్ , చంటి, అఖిల్, ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, వర్కర్స్ కళ్యాణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# చదరంపెంట గూడెంను పట్టించుకోని అధికారులు

**-నెలలు గడుస్తున్న వీధి దీపాలు వేయని వైనం**

**-రాత్రి అయితే మబ్బులోనే గిరిజన కుటుంబాలు**

**-అడవి జంతువుల రాకతో భయాందోళనలో గిరిజనులు**

**-ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్న గిరిజనులు**



**కొత్తపల్లి – నంది పత్రిక** గిరిజనులు అధిక శాతం ఆటవీ ప్రాంతానికి చెరువులో నివశిస్తుంటారు. అయితే ఐటీడీఏ, అటు ప్రభుత్వం వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటారు. కానీ దానికి భిన్నంగా మండలంలోని గువ్వలకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన చదరం పెంట గూడెంను అధికారులు పట్టించుకోవడం లేదని ఇట్టే తెలుస్తుంది. అక్కడ అన్ని వసతులు ఉన్నా రాత్రి పూట బయం భయంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గూడెంలో విద్యుత్ స్థంబాలు వీధి వీధినా ఉన్నాయి. కానీ ఎటువంటి ప్రయోజనం లేదు. ఎదో నాలుగు స్తంభాలకు ఉన్న విద్యుత్ దీపాలు తప్ప ఏ ఒక్క స్థంబానికి విద్యుత్ దీపాలు లేవు, అక్కడక్కడా ఉన్నా వెలగవు అని గూడెంవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతానికి ఈ గూడెం ఆతీ సమీపంలో ఉండడంతో కాబట్టీ వన్యమృగాలు తరచూ గూడెం సమీపానికి వస్తున్నాయని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. రెండు, మూడుసార్లు గిరిజనులపై ఎలుబంట్లు, పులులు కూడా దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్న గిరిజనులు చీకటిలో మగ్గుతున్నా ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. పంచాయతీ అధికారులు గాని, మండల స్థాయి అధికారులు గాని ఆ గూడెంవైపు కన్నేత్తి చూసిన పాపాన పోలేదని గిరిజనులు బాదను వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. పోతన్న, చదరంపెంట గూడెం గిరిజనుడు గూడెంకు నాలుగు నెలలనుంచి విద్యుత్ దీపాలు వెలగడంలేదు. కొన్ని స్థంబాలకు అస్సలు వీధి దీపాలు వేయలేదు. పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అస్సలు పట్టించుకోవడం లేదు. మబ్బులోనే రాత్రిల్లు ఉంటున్నాము. బయటికి రావాలంటే ఏ జంతువు మాపై దాడి చేస్తుందో అన్న భయం ఉంది. ఈ అధికారులు కాకపోయిన పై అధికారులన్న స్పందించి మాగూడెంలో వీదీ దీపాలు అమచ్చాలి

# ఆర్ఎస్ రంగాపురం లో ఏటీఎం బంద్.

**ఏటీఎం సేవలు లేక ఇక్కట్లు పడుతున్న కస్టమర్లు.**

**ప్రైవేట్ వ్యక్తులు విత్ డ్రాలకు కమిషన్ వసూలు చేస్తున్న వైనం.**

**త్వరగా ఏటీఎం సేవలు పునఃప్రారంభించాలని ప్రజల విజ్ఞప్తి**

**బేతంచెర్ల ఏప్రిల్ 21 ( నందిపత్రిక ).** బేతంచర్ల మండలం ఆర్ ఎస్. రంగాపురం గ్రామంలో ఉన్న స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ఏటిఎం, గత రెండు వారాలు గా మూత పడినట్లు గ్రామస్థులు మంగళవారం తెలిపారు. స్థానిక గ్రామస్తులు మాట్లాడుతూ ఏటి ఎం తెరుచుకోక పోవడంతో, డబ్బుల కోసం నా నా ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు అత్యవసరమై, ప్రయివేట్ వ్యక్తుల దగ్గరికి వెళ్తే 1వెయ్యి రూపాయలు మీద దాదాపు 20 నుండి 40 రూపాయలు మేర వసూలు చేస్తున్నారని, ఎన్ని వేలు తీసుకుంటే అంత కమిషన్ ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోయారు. ఏదిఏమైనా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. గ్రామస్తులు మరియు ఎస్బిఐ కస్టమర్ లు విజ్ఞప్తి చేస్తున్నారు.




## మనమిత్ర యాప్న సద్వినియోగం చేసుకోండి

**- ఎంపీడీఓ మేరి**



**కొత్తపల్లి – నంది పత్రిక :** ప్రజలు ప్రభుత్వం నిర్వహించే మనమిత్ర యాప్ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దుద్యాల, కొక్కెరంచ గ్రామాలలో ఆమె 'మనమిత్ర యాప్పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాట్సాప్ ఆధారిత పాలన సేవ ద్వారా పౌరులకు 160 కి పైగా ప్రభుత్వ సేవలను ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధగా సులభంగా ధ్రువీకరణ పత్రాలు, బిల్లులు, ఫిర్యాదులు స్వీకరించడం, ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా సచివాలయ సేవలను నురుగా ప్రజలకు చేవేస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ సహాకారంతో సంగమేశ్వరంలో చలువపందిళ్ల ఏర్పాటు



**కొత్తపల్లి – నంది పత్రిక:** మండల పరిధిలోని సప్తనది సంగమేశ్వరంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సహాకారంతో మంగళవారం ఆలయం చుట్టూ చలువ పందిళ్ళు ఏర్పాటు చేశామని పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ అన్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చలువ పందిళ్ళు. భక్తులు నీడలో కూర్చోవడానికి. వృద్ధులు కూర్చోవడానికి తాకాలిక బండల అరుగులు, త్రాగునీటికోసం బోర్ వాటర్ ద్వారా రెండు వేల లీటర్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా చేతిపంపు దగ్గర భక్తులు కాళ్ళు కడుక్కొనేందుకు నాలుగు డ్రమ్ములు ఏర్పాటు చేశామన్నారు.

## వేసవి తాపాన్ని తీర్చడం కొరకు చలివేంద్రాన్ని ఏర్పాటు

**డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శ్రీదేవి**





**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** మంగళవారం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో వేసవి తాపాన్ని తీర్చడం కొరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది . ముఖ్యఅతిథిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శ్రీదేవి చలివేంద్రాన్ని ప్రారంభోత్సవం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్ హనుమంతరావు జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎం సుధీర్ బాబు అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపర్ ఇంటెండెంట్ రామకృష్ణారెడ్డి సిఐలు చంద్రహాస్ రాజేంద్రప్రసాద్ మరియు ఎస్ఐలు రెహానా వెంకటరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో “ప్రపంచ సృజనాత్మకత, ఆవిష్కరణల దినోత్సవం“ వేడుకలు




**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 21 ( నంది పత్రిక )**నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో “ప్రపంచ సృజనాత్మకత , ఆవిష్కరణల దినోత్సవం“ అత్యంత ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రార్థనా గీతంతో గౌరవప్రదంగా ప్రారంభమైంది.అధ్యాపకులు రత్నా రామిరెడ్డి మాట్లాడుతూ “నేటి యువత కేవలం ఏఐ సాధనాలైన ఛాట్ జిపిటి లేదా జెమినీ వంటి సాంకేతికతకు బందీలు కాకూడదు. కృత్రిమ మేధస్సు కేవలం ఒక సహాయకారి మాత్రమే, కానీ అది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని గ్రహించాలి. విద్యార్థులు తమలో నిశిత పరిశీలన విమర్శనాత్మక ఆలోచనా ధోరణి పెంపొందించుకోవాలి. కొత్త పుంతలు తొక్కే ఆలోచనలే రేపటి తరానికి దిశానిర్దేశం చేస్తాయి.“

**అధ్యాపకులు సాదిక్ మాట్లాడుతూ** “సృజనాత్మకతకు నిలువెత్తు రూపం చిన్న పిల్లలు; ఎందుకంటే వారి ఆలోచనలకు హద్దులు ఉండవు. మనం కూడా అదే ఉత్సాహంతో మన పరిధిని దాటి ఆలోచించాలి. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజంలోని సమస్యలను పరిష్కరించే ‘సమస్య పరిష్కార వేదిక‘ గా మన ఆలోచనలు మారాలి. సాంకేతికతను వాడుకుంటూనే, మన సహజ సిద్ధమైన మేధస్సుకు పదును పెట్టాలి అని తెలిపారు.

**అధ్యాపకులు కరుణ మాట్లాడుతూ** “ఆవిష్కరణ అంటే ఏదో పెద్ద యంత్రాన్ని కనిపెట్టడం మాత్రమే కాదు, పర్యావరణానికి మేలు చేసే చిన్న మార్పు కూడా ఒక గొప్ప ఆవిష్కరణే. ఉదాహరణకు, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడానికి ఎండాకాలంలో చెరుకు రసం కోసం ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా, చెరుకు గడలనే సహజ సిద్ధమైన గ్లాసులుగా మలిచే సరికొత్త ఆలోచనలు చేయాలి. ఇటువంటి స్థిరమైన ఆలోచనలే ప్రస్తుత ప్రపంచానికి అవసరం అని పేర్కొన్నారు.

**అధ్యాపకులు శ్రావణ్ కుమారి** “మన కళాశాలలోని ఇన్నోవేషన్ సెంటర్ విద్యార్థుల మేధస్సుకు ఒక ప్రయోగశాల వంటిది. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను పంచుకోవడానికి మరియు వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి మేనేజ్‌మెంట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. డైరెక్టర్ , చైర్మన్ అందించే ఈ గొప్ప అవకాశాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకుని భావి ఆవిష్కర్తలుగా ఎదగాలి అన్నారు.

**అధ్యాపకులు ప్రత్యూష మాట్లాడుతూ** “ప్రతి నూతన ఆలోచన ఒక విప్లవానికి నాంది పలుకుతుంది. విద్యార్థులు తమ సృజనాత్మకతను నిరంతరం ప్రవహించే నదిలా ఉంచుకోవాలి. నిరంతర సాధన మరియు సరికొత్త దృక్పథంతో ముందడుగు వేసినప్పుడే మనం ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించగలము అని తెలిపారు.

**కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ** నేడు మనం జరుపుకుంటున్న ఈ ‘ప్రపంచ సృజనాత్మకత మరియు ఆవిష్కరణల దినోత్సవం‘ కేవలం ఒక రోజు వేడుక కాదు; ఇది మన ఆలోచనా సరళిని మార్చుకోవాల్సిన సమయం. సృజనాత్మకత అనేది కేవలం కళాకారులకో, శాస్త్రవేత్తలకో పరిమితమైనది కాదు. అది ప్రతి మనిషిలో నిబిడీకృతమై ఉంటుంది. మీ ఆలోచన ఒక పరిష్కార మార్గంగా మారినప్పుడే అది ఆవిష్కరణ అవుతుంది. మీరు నిరంతరం గమనిస్తున్న మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ మరియు ఆధునిక యంత్రాలు కేవలం లోహపు ముక్కలు కావు; అవి మానవ మేధస్సు నుండి పుట్టిన అద్భుతాలు. ఒకప్పుడు అసాధ్యం అనుకున్నవి నేడు సుసాధ్యం అయ్యాయంటే దానికి కారణం ఎవరో ఒకరు ‘ఎందుకు కాకూడదు?‘ అని కొత్తగా ఆలోచించడమే. కేవలం పరీక్షల కోసం చదవడం కాకుండా, విద్యార్థి తాను చదివే ప్రతి అంశంలో ఒక సరికొత్త దృక్పథాన్ని, కొత్త నేర్చుకునే పద్ధతిని వెతకాలి. అలాగే, ఒక ఉపాధ్యాయుడు పాత పద్ధతులకు భిన్నంగా, విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధనా పద్ధతులను నవీకరించుకోవాలి. ఈ విధమైన చిన్న చిన్న మార్పులే మన జీవన ప్రయాణాన్ని మెరుగుపరుస్తాయి. నేటి కాలంలో ఏ సమాచారం కావాలన్నా ఇంటర్నెట్ లో లభిస్తోంది. కానీ, గూగుల్ లేదా ఏఐ సాధనాలు మీకు సమాచారాన్ని మాత్రమే ఇస్తాయి, జ్ఞానాన్ని కాదు. మీ మెదడుకు పదును పెట్టండి. సమస్యలను సవాలుగా తీసుకోండి. సమాజంలోని పేదరికం, కాలుష్యం లేదా నీటి సమస్యలకు మీ సృజనాత్మకతతో పరిష్కారాలు కనుగొన్నప్పుడే మీ చదువుకు సార్థకత లభిస్తుంది. మీరు చేసే ప్రతి ఆలోచన సమాజ హితం కోసం ఉండాలి. మన కళాశాల అందించే ప్రతి అవకాశాన్ని వాడుకుంటూ, మీరు కేవలం ఉద్యోగాల కోసం వెతికే వారు కాకుండా, పదిమందికి ఉద్యోగాలిచ్చే ఆవిష్కర్తలుగా ఎదగాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. “ఆవిష్కరణ అనేది కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు; అది సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేయాలి. నేడు మనం అనుభవిస్తున్న ఇంటర్నెట్, మొబైల్ విప్లవం అంతా ఒకప్పుడు ఎవరో ఒక సామాన్యుడు చేసిన అసామాన్య ఆలోచనల ఫలితమే. విద్యార్థులు తమ అభ్యసన ప్రక్రియలోనూ, ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులలోనూ నవీనత్వాన్ని ప్రవేశపెట్టినప్పుడే అది సమాజ ప్రగతికి బాటలు వేస్తుంది. ప్రతి విద్యార్థి ఒక ఆవిష్కర్తగా ఎదగాలని నేను ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు.ఈ విధంగా డైరెక్టర్ ప్రసంగం విద్యార్థులలో నూతన ఉత్తేజాన్ని ఆలోచనా శక్తిని నింపింది.ఈ కార్యక్రమం మేనేజ్‌మెంట్ అధ్యాపకులు ఎం. ఇంతియాజ్ అహమ్మద్ నిర్వహణలో అధ్యాపక బృందం కృషితో దిగ్విజయంగా పూర్తయింది. చివరగా, అందరూ ఐకమత్యంతో జాతీయ గీతాన్ని ఆలపించడంతో కార్యక్రమం ముగిసింది.



# విధులకు సకాలంలో హాజరు కావాలి

**- తహసిల్దార్ ఉమారాణి**



**కొత్తపల్లి - నంది పత్రిక:** సచివాలయాల సిబ్బంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులకు సకాలంలో హాజరు కావాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నందికుంట, కొత్పల్లి గ్రామాల సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా హాజరు రిజిస్టరు, ఇతర సర్వేల రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా ఆన్లైన్ సర్వే రిపోర్టులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిబ్బంది ఉదయం 10 గంటల లోపు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సర్వేలను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీప్యూటీ తహసీల్దార్ అరుణ ఉన్నారు.

## నంద్యాల గ్రామ సంఘాల సహాయకులకు (వి.ఓ.ఏ) 5+ స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని మంత్రి గారి క్యాంపు కార్యాలయంలో ఈరోజు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్.ఈ.ఆర్.పి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ సంఘాల సహాయకులు (వి.ఓ.ఏ)లకు 5+ స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా వి.ఓ.ఏ లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పాలనలో సాంకేతికతను జోడించి, పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేయడంలో భాగంగా వి.ఓ.ఏ లకు ఈ అత్యాధునిక 5+ స్మార్ట్ ఫోన్లను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా చేరవేయడంలో ఈ ఫోన్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు కట్టుబడి ఉందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ పీడీ శ్రీధర్ రెడ్డి, నంద్యాల మరియు కోస్పాడు మండల ఏపీఎంఎస్ , సిసిఎస్ వి.ఓ.ఏ.ఎస్ మరియు గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల మండల టీడీపీ కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి , ఓబుల్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్.





**కేసముద్రం, ఏప్రిల్ 21(నంది పత్రిక):**తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలో గుండెబోయిన ఎల్లమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ గృహప్రవేశంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. గృహ ప్రవేశం అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటుగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా ప్రభుత్వంగా గుర్తింపు పొందిందని, రెండవ విడుతలో కూడా పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దగాని రవి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు గండి శ్రీనివాస్, వార్డ్ సభ్యులు ఘంట రామ్మోహన్ రెడ్డి, ఘంట బాలకృష్ణ రెడ్డి, కొమ్మాల జయిందర్ రెడ్డి, జల్లె లచ్చయ్య, బొడ్డు బిక్షం, దయ్యాల యాకన్న, సెక్రటరీ సాయితేజ పాల్గొన్నారు.



## పిల్లల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్య పునాది.

**కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న**



**కేసముద్రం, ఏప్రిల్ 21(నంది పత్రిక):**పిల్లల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్య పునాది లాంటిదని కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. మంగళవారం కేసముద్రం మున్సిపల్ పరిధిలోని విలేజ్ కేసముద్రం ప్రీ ప్రైమరీ స్కూల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీతవెంకన్న, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, అందులోనూ ప్రీ ప్రైమరీ విద్య అనేది పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మొదటి మెట్టన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ చేతుల మీదుగా పట్టాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పిల్లల ప్రతిభను ప్రత్యేకంగా వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, సిడిపిఓ శిరీష, కౌన్సిలర్స్ వేముల భారతి, కనుకుల సుభద్ర, వల్లందాసు ఉమ, మేకల శారద,రావుల వినయ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు. డి డి ఓ అన్వర్ బేగం



**జూపాడుబంగ్లా: ఏప్రిల్ :21: ( నంది పత్రిక )** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. వేసవి కాలంలో బాటసారుల దప్పిగా తీర్చేందుకు చలివేంద్రాన్ని మంగళవారం డిడిఓ అన్వర్ బేగం, ఎంపీపీ మిద్దె నీలమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వేసవికాలంలో ఆరారా గొంతు ఎండిపోతూ ఉంటుంది .అందుకే చుక్క నీటి కోసం అల్లాడిపోతుంటాము రోడ్లపైకి వస్తే మండుటెండల్లో దాహార్తి వేధిస్తూ ఉంటుంది . తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన ... దాహం దాహం అంటూ గొంతు ఎండిపోతూ ఉంటుంది . ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రములో ప్రతిరోజు స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు పద్మావతమ్మ, జె. మోహన్ నాయక్, ఏవో మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ అన్వర్, సీనియర్ అసిస్టెంట్ మద్దమ్మ, కంప్యూటర్ ఆపరేటర్ సందీప్, పాల్గొన్నారు.



## ఉదయనిధి అఫిడవిట్‌లో లెక్కల తారుమారు.. ఐటీ శాఖ సంచలన ఆరోపణలు!

తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్లలోని గణాంకాలపై ఆదాయ పన్ను శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 2021 అఫిడవిట్ కు, 2026 ఎన్నికల అఫిడవిట్ కు మధ్య తేడాలు ఉన్నాయని మద్రాస్ హైకోర్టుకు ఐటీ శాఖ తెలిపింది. 2021 అఫిడవిట్‌లో రెడ్ జెయింట్ మూవీస్‌లో రూ. 7.36 కోట్ల పెట్టుబడి ఉన్నట్లు చూపిన ఉదయనిధి, 2026 అఫిడవిట్‌లో ఆ ప్రస్తావనే చేయలేదు. అదే సంస్థలో ఆయన భార్య పేరిట రూ. 2.63 కోట్ల పెట్టుబడులు ఉన్నట్టు ప్రస్తుత అఫిడవిట్లో చూపించారని... ఈ పెట్టుబడులను 2021 అఫిడవిట్లో ప్రస్తావించలేదని ఐటీ శాఖ పేర్కొంది. 2021లో రూ. 11.06 కోట్లు, 2026లో రూ. 10 కోట్ల బ్యాంకు రుణం ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. కానీ కంపెనీ రికార్డుల ప్రకారం అది రూ. 18 కోట్లుగా ఉందని ఐటీ శాఖ వెల్లడించింది.

## అమెరికా-ఇరాన్ చర్చలపై ఆశలు.. వరుసగా మూడో రోజూ లాభాల్లో మార్కెట్లు

అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు అందడంతో భారత స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య జరగనున్న చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించవచ్చనే ఆశలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఫలితంగా, మంగళవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 753.03 పాయింట్లు లాభపడి 79,273.33 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 211.75 పాయింట్లు పెరిగి 24,576.60 వద్ద ముగిసింది. నెస్లే ఇండియా, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి.

# ప్రజల సంక్షేమం కోసం పరిపాలనలో నూతన ఆవిష్కరణలు తీసుకువచ్చి, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకం










## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 21నంది పత్రిక** దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న నిర్వహించే నేషనల్ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా అధికారులు ఒక లక్ష్యంతో కట్టుబడి పనిచేస్తున్న తీరు అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిబద్ధత, పారదర్శకత, సమర్థత మరియు ప్రజల పట్ల అంకితభావం వంటి విలువలను మరింత బలపరచడానికి ఈ రోజు ఒక స్ఫూర్తిదాయక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సమగ్ర సంక్షేమం మరియు సుస్థిర పురోగతిలో సివిల్ సర్వీసుల పాత్ర అపూర్వమని తెలిపారు. సివిల్ సర్వెంట్లు తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య మరియు డిజిటల్ పరిపాలన రంగాల్లో వారు చూపుతున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం పరిపాలనలో నూతన ఆవిష్కరణలను ప్రవేశపెట్టి సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్నత ప్రమాణాలు, పారదర్శకత, సమర్థత మరియు నిబద్ధతను ప్రోత్సహించేందుకు ఈ రోజు ఒక ముఖ్య సందర్భంగా నిలుస్తుందని అన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా అధికారులు ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మర్యాదపూర్వకంగా, నాణ్యమైన సేవలు అందించడం ప్రతి అధికారికి ముఖ్య బాధ్యత అని అన్నారు. “అక్షర” కార్యక్రమం ద్వారా పుస్తకాలను సేకరించి ఆసక్తి ఉన్న విద్యార్థులకు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో తాను తరచూ పాఠశాలలను సందర్శిస్తున్నానని వెల్లడించారు.తొలుత వివిధ శాఖల అధికారులు తమ బాల్యంలో ఎదుర్కొన్న విద్యా సవాళ్లు, చదువులో సాధించిన విజయాలు, ప్రస్తుతం అందిస్తున్న సేవలపై తమ అనుభవాలను సభాముఖంగా పంచుకున్నారు. కార్యక్రమం ముగింపులో వివిధ శాఖల అధికారుల ఉత్తమ పనితీరును గుర్తిస్తూ మెమెంటోలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిలో భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, నర్సాపురం ఆర్డీవో దాసి రాజు, డీఈవో ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దొసిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణకుమారి, జిల్లా వెనుకబడిదల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి సూరిబాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా ఆర్ అండ్ అధికారి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డిఏం ఇబ్రహీం, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, మత్స్య శాఖ ఏడి ఎల్ ఎల్ ఎన్ రాజు, జిల్లా దివ్యంగుల సంక్షేమ శాఖ అధికారి రామ్ కుమార్, ఈ డివిజన్ మేనేజర్ ఎం.కిరణ్ కుమార్, కలెక్టరేట్ డిటి ఎం.సన్యాసిరావు, ఇరగవరం ఎంపీడీవో శ్రీనివాసరావు, గణపవరం డిప్యూటీ ఎంపీడీవో పివి సత్యనారాయణ, నరసాపురం మండలం లిఖితపూడి గ్రామం పంచాయతీ సెక్రెటరీ శివ కళ్యాణి ఉన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# “చంద్రబాబు గారి నాయకత్వంలో నంద్యాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతాం - ఫిరోజ్“



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 21 ( నంది పత్రిక )**నంద్యాల పట్టణంలోని 35వ వార్డు సలీం నగర్‌లో తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ సలీం నగర్ నాయకులు హిదాయతుల్లా ఖాన్ =ఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీవీణ ఫిరోజ్ గారు ముఖ్య అతిథిగా హాజరవ్వడంతో వార్డు నాయకులు మరియు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చీవీణ ఫిరోజ్ గారు తన చేతులా మీదుగా కేక్ కట్ చేసి, కార్యకర్తలకు తినిపిస్తూ ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చీఎం ఫిరోజ్ గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల అభివృద్ధి మరియు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు గారు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవిస్తూ రాష్ట్రాభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.చంద్రబాబు నాయుడు గారు దూరదృష్టి గల నాయకుడు,టెక్నాలజీ, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యా రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన విజనరీ లీడర్. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులకు బలమైన మద్దతు ఇవ్వడం, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం ఆయన లక్ష్యం. ప్రతి కార్యకర్త కూడా ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలపరచాలని” పిలుపునిచ్చారు.

అదే విధంగా నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి కూడా చంద్రబాబు గారి నాయకత్వంలో మరింత వేగం పెరుగుతుందని ప్రతి వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేసి ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం అనంతరం, చీవీణ ఫిరోజ్ గారు వార్డు నాయకులు కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ టీ సేవిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.




# సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య.



**నందికొట్కూరు ఏప్రిల్ 21 ( నంది పత్రిక )** మండల పరిధిలోని బిజినవేముల నాగటూరు, కొణిదెల గ్రామములో మంగళవారం సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.2,27,041 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయసూర్య స్థానిక టిడిపి నాయకులతో కలిసి స్వయానా లబ్ధిదారుల గృహాలకు వెళ్లి చెక్కులను అందజేశారు. ముందుగా బిజినముల గ్రామంలో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ రవి యాదవ్ ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు పుష్పగుచ్చం అందజేస్తూ సాధర ఆత్మీయ స్వాగతం పలికారు.సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న వారిలో గొల్ల విజయ్ కుమార్ రూ. 55285, బచ్చు హరికృష్ణ రూ.51429,పోరెడ్డి సుధారాణి రూ. 25460,ఆవుల రాములమ్మ రూ.43000,వరాల శ్రీనివాసులు రూ. 51867 లు వున్నారు . ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు నాయుడు కు మరియు ఎమ్మెల్యే గిత్త జయ సూర్యకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి , సొసైటీ చైర్మన్ ముర్తు జావలి, మండల నాయకులు గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.



# రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి: ఎస్సై రామ్మోహన్ రెడ్డి



**మహానంది,ఏప్రిల్ 21 (నంది పత్రిక ):-** రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని మహానంది ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మహానంది మండలం గాజులపల్లె పరిధిలోని నంద్యాల- గిద్దలూరు జాతీయ రహదారి మెట్ట యందు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, సరైన ధ్రువపత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వానలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.రోడ్డు నిబంధనలు పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు.డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లు ఉపయోగించరాదని,ఇతరులతో మాట్లాడరాదని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. భద్రత గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరంఎంతైనా ఉందన్నారు. ఎవరికి వారు భద్రతా చర్యలు పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ తనిఖీల్లో మహానంది పోలీస్ సిబ్బంది, ఉసేని, జనార్ధన్, నారాయణస్వామి, నాగన్న, మల్లికార్జున, మురళి తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ టార్గెట్లు పూర్తి చేయాలి. తహసిల్దార్ వి. చంద్రశేఖర్ నాయక్



**జూపాడుబంగ్లా :ఏప్రిల్: 21: (నంది పత్రిక)** ప్రతి ఉద్యోగి ఇంటింటికి తిరిగి 50 ఇళ్లు టార్గెట్ ను పూర్తి చేయడమే కాక వారి విషయాలు గోప్యంగా ఉంచాలని తహశీల్దార్ వి. చంద్రశేఖర్ నాయక్, యం.పీ.డీ.ఓ గోపీ క్రిష్ణ అన్నారు. మండలంలోని మొత్తం 41 మంది ఎనిమిరేటర్లు మరియు సూపర్వైజర్లు ప్రభుత్వ పాఠశాల, లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ శిక్షణను రెండు బ్యాచ్ లుగా విభజించి, 41 మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. డేటా సేకరణ విధానము ఫీల్డ్ లో అనుసరించవలసిన మార్గదర్శకాలు ప్రాక్టికల్ అంశాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. జనగణ న కు వెళ్లే సచివాలయ సిబ్బంది చాలా బ్రాండ్ మైండ్ తో వెళ్లాలని సూచించారు. చివరి రోజున శిక్షణ తో పాటు నూూ టెస్టు యాప్ ను ఫీల్డ్ ట్రైనర్లు ద్వారా ఎనిమిరేటర్లు మరియు సూపర్వైజర్ల కు మొబైల్ లో ఇన్స్టాల్ చేసుకొని కొన్ని ఇండ్లను క్షేత్రస్థాయి లో చేశారని తహశీల్దారు తెలిపారు. టెస్టింగ్ కొరకు క్రియేట్ చేసిన యూజర్ ఐ.డీ ద్వారా రోజున టెస్టు యాప్ లో కొన్ని ఇళ్ల ను క్షేత్రస్థాయిలో గణన చేసినట్లు మండల గణాంక అధికారి ఏ.యస్.ఓ హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.టీలు సత్యదీప్, ఎన్. నాగన్న పాల్గొన్నారు. రేపటి స్వీయ గణన పై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ తహశీల్దారు మరియు యం.పీ.డీ.ఓ తెలిపారు.



# బడి ఈడు పిల్లలను సకల సౌకర్యాలు గల ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి: కౌసల్య భాయి, హెచ్ఎం.

## బడి పిలుస్తోంది భారీ ర్యాలీ



**నందికొట్కూరు ఏప్రిల్ 21 ( నంది పత్రిక )** 2026-2027 విద్యా సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 17 నుండి 23 వరకు ఏర్పాటు చేసిన“బడి పిలుస్తోంది“ “విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్“లో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోట (బాలురు) ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మంగళవారం బైరెడ్డి నగర్ కాలనీ నందు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని వీధుల గుండా రంగు రంగుల జెండాలు చేత బట్టి,విద్యకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయబడుతున్న పథకాలు, విద్య ఆవశ్యకత తెలిపే బ్యానర్లు పట్టుకుని, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగాంచారు.అనంతరం బైరెడ్డి నగర్ కూడలి లో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాలనీ లోని ఇళ్ల వద్ద ప్రధానోపాధ్యాయులు కౌసల్యా బాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని,అత్యున్నత విద్యార్హతలు , అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని కావున బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో తప్పకుండా చేర్పించాలని తల్లి తండ్రులను కోరారు.పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ నిర్వహణలో జరిగిన ఈ ఎన్రోల్మెంట్ డ్రైవ్ ర్యాలీ లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యా బాయి, పాఠశాల ప్రథమ సహాయకులు సాలమ్మ , ఉపాధ్యాయినులు విజయ కుమారి, లలితమ్మ, లలిత కుమారి, సరోజిని దేవి, క్రాఫ్ట్ టీచర్ అనిత ఉపాధ్యాయులు వెంకట రమణ,ఈశ్వరయ్య, మల్లికార్జున రెడ్డి,వెంకటేశ్వర్లు, రామి రెడ్డి, నాగేశేషులు కంప్యూటర్ ఆపరేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిశంకర జయంతి మహోత్సవం...



**చాగలమర్రిప్రతినిధి ఏప్రిల్ 21నంది పత్రిక** చాగలమర్రిలోని పాత శివాలయంలో ఆదిశంకర జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవత, రామాయణ గ్రంథాలను చదివి విశదీకరించారు. సనాతన ధర్మ పరిరక్షణ జరగాలని , ప్రతి ఒక్కరూ భక్తితో ప్రార్థనలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులకు, ఆచార్యులు , అర్చకులు దేవుని చిత్రపటాలను పంపిణీ చేశారు.

# మంత్రివర్యులు మా నీటి కష్టాలు తీర్చండి

## త్రాగునీటి కోసం కోవెలకుంట్ల శ్రీరాం నగర్ కాలనీ వాసుల అవస్థలు



**కోవెలకుంట్ల ఏప్రిల్ 21నందిపత్రిక** కోవెలకుంట్ల లోని శ్రీరామ్ నగర్ కాలనీలో గత కొద్ది రోజుల నుండి త్రాగు నీటి సమస్య భయంకరంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనికి అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా నెలకు ఒక్కసారి నీరు రావడం జరుగుతుందని వచ్చిన నీళ్లు కూడా సరిగ్గా లేకపోవడంతో కాలనీ వాసుల నీటి తిప్పలు దేవుడికే ఎరుక అని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ మేరకు మంగళవారం వారు సోషల్ మీడియా గ్రూపులో నీటి సమస్యను తీర్చాలని మంత్రికి మొరపెడుతునట్లు పోస్ట్ చేశారు.కాలనిలో.నీటి సమస్య ఈ విదంగా ఉంటే గ్రామ పంచాయతీ ఈవో పట్టించుకోక పోవడం గమనార్హం



# పుట్టబోయే పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి

# గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి





## పిల్లలను ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 21నంది పత్రిక** ఎనిమిదవ పోషణ పక్వాడ 2026 కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు కళ్యాణ మండపంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పుట్టబోయే పిల్లల శారీరక మరియు మానసిక అభివృద్ధికి గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు మరియు బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన, తెలివైన పిల్లలు జన్మిస్తారని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. గర్భిణీలు సానుకూల ఆలోచనలు పెంపొందించుకోవాలని, మంచి సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, యోగా, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచించారు. అలాగే చిన్నారులు పెద్దలతో సమయం గడపడం ద్వారా కుటుంబ విలువలు, సంప్రదాయాలు అలవర్చుకుంటారని తెలిపారు. కథలు వినడం, అనుభవాలను పంచుకోవడం ద్వారా పిల్లల మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలని, వారికి ఇంటి వాతావరణంలో ప్రేమతో కూడిన మార్గదర్శనం ఇవ్వాలని సూచించారు. సాంప్రదాయ ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఫాస్ట్ ఫుడ్ మరియు జంక్ ఫుడ్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. పిల్లలకు వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని అందించాలని, అలాగే చిన్నారులను సెల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, సీడీపీవో విజయరత్నం, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్దల మధ్య పెద్దమ్మ తల్లి దేవర హాజరైన రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రజక.

**రుద్రవరం(నంది పత్రిక)** రుద్రవరం మండలం రుద్రవరం గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన అనుచరులతో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి మెలిసి భక్తిశ్రద్ధలతో దేవరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి సాంప్రదాయ ఉత్సవాలు ప్రజల ఐక్యతను భక్తిని బలపరుస్తాయని పేర్కొన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు.



# కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఫలితాలలో విజయ కేతనం

## బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్



**కుప్పం, (నంది పత్రిక) ఏప్రిల్ 21** కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ ప్రథమ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరీక్షల పరిశీలకులు ప్రొఫెసర్ డాక్టర్ వి బి చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, హుమానిటీస్ అండ్ సైన్స్ స్ విభాగాధిపతి మాధవన్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం. సోమ సుందరం కలిసి మంగళవారం పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యా సంస్థల అధినేత డాక్టర్ బీసీ నాగరాజు మాట్లాడుతూ... సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచడం ఆనందకరమని తెలిపారు. ఈ విజయాన్ని కొనసాగిస్తూ కళాశాలలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను అధ్యాపకులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి సి నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ సునీల్ రాజ్, సెక్రటరీ ఎన్ సాగర్ రాజ్, విభాగాధిపతులు అభినందించారు.

# చెత్త నుంచి సంపద సృష్టించడం లక్ష్యం

# ప్రజల ఆరోగ్యం ప్రథమ ప్రాధాన్యం





## రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

## పాలకొల్లులో రూ.5 కోట్లతో ఆధునిక చెత్త ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు

## రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్

**పాలకొల్లుబ్యూరో చీఫ్ ఏప్రిల్ 21,నంది పత్రిక** పాలకొల్లు పట్టణంలోని ఎడ్ల బజార్, సూరితేజ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న బయో మైనింగ్ పనులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మరియు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లెగసీ వ్యర్థాల తొలగింపు పనులను సమీక్షించి మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లకు తగిన సూచనలు ఇచ్చారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడం మాత్రమే కాకుండా ప్రజలు ఆరోగ్యంగా జీవించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రాన్ని "స్వచ్ఛ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్ర"గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో భారీగా పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి పూర్తిగా తొలగించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. పాలకొల్లులోని డంపింగ్ యార్డుల్లో కొండల్లా పేరుకుపోయిన చెత్తను తొలగించి, భవిష్యత్తులో తడి-పొడి చెత్త వేరు చేసి, వ్యర్థాలను వనరులుగా మార్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పాలకొల్లు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్లు మెట్రిక్ టన్నుల చెత్త గుర్తించగా, అందులో ఒక కోటి మెట్రిక్ టన్నులు ఇప్పటికే ప్రాసెస్ చేసినట్లు తెలిపారు. మిగిలిన వ్యర్థాలను త్వరితగతిన తొలగించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పాలకొల్లులో ఇప్పటికే వేలాది టన్నుల చెత్తను క్లియర్ చేయగా, ప్రస్తుతం 57,600 మెట్రిక్ టన్నుల బయో మైనింగ్ పనులకు ఆర్డర్లు జారీ చేశామని చెప్పారు. అదనంగా డ్రోన్ సర్వే ద్వారా మిగిలిన వ్యర్థాల అంచనాలు తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. పాలకొల్లులో రూ.5 కోట్ల వ్యయంతో ఆధునిక వ్యర్థ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపే దిశగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డులను సుందరీకరణ చేయడం కూడా ప్రణాళికలో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు..

# తాళ్ళపూసపల్లిలో వ్యవసాయాధికారుల పర్యటన.



**కేసముద్రం, ఏప్రిల్ 21(నంది పత్రిక)**:కేసముద్రం మండలం లోని తాళ్లపూసపల్లి గ్రామం లో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి మహబూబాబాద్ భూక్య సరిత, సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్నతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో సాగు చేస్తున్న సేంద్రియ రైతు ఎస్.జైపాల్ రెడ్డికి చెందిన వ్యవసాయ పంట క్షేత్రం, రైతు ఉత్పత్తి దారుల సంఘం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి వి.లావణ్య, రైతులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం, హరి నగర్ లోని ప్రాధమిక పాఠశాలలో 52 మందికి విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపకులు సమాజ సేవకులు డా.సి.గంగన్న, పాదరక్షలు పంపిణి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 20 తేదీన బడిబాట కార్యక్రమము లో విద్యార్థులు ర్యాలీ వెళు చున్న సమయం లో, ఎవరికి చెప్పులు లేవు, విద్యార్థులను చూసి వారు పడుతున్న బాధను చూసి వెంటనే నా సతీమణికి తెలిపాను . మీరు సమాజ సేవకులు కదా, అందులో ఈ సంవత్సరము ఎండలు ఎక్కువ గా ఉన్నాయి , అందులో గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ఎక్కువ ఉంటారని చెప్పారు. నేను ఏ సేవా కార్యక్రమాలు నిర్వహించిన మా సతీమణి పూర్తి మద్దతు ఇస్తున్నారు. ఏ పనిచేస్తున్నా ఓ స్త్రీ వుంటుందని అంటారు, నా వెనుక నా సతీమణి నన్ను ప్రోత్సహిస్తుందని గర్వంగా చెబుతున్నానన్నారు . ముఖ్యంగా చదువుకునే రోజులలో మేము కూడ పేద వాళ్లమే, ఆ రోజులలో డబ్బులు లేక నన్ను కూడ స్నేహితులు చదివించారు, అది ఇప్పటికీ మరిచి పోలేదు. తల్లిదండ్రుల లేని పిల్లలు వుంటే వారికి ఆర్థికంగా భరోస ఇస్తు నేనే జీవితాంతం చదిసాను అని చెప్పడం జరిగింది . ఈ కార్య క్రమములో ఎంఈఓ 2 లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు జెర్సీ , ఉపాధ్యాయులు, ,జాన్సన్ మల్లిశరి శిమల్లేశ్వర్య 0 పాల్గొన్నారు.

# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్శ్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకులు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని

ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

## రైతులను హెచ్చరించిన అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రూ.20 లక్షల మహిళా భవన్ ప్రధాత కమలా లక్ష్మి కి కృతజ్ఞతాభివందనలు

**నూజివీడు:బ్యూరో చీఫ్ ఏప్రిల్:21నంది పత్రిక** నూజివీడు రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కార్యాలయంలో కూటమి మహిళా నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రివర్యులు కొలుసు పార్థసారథి సతీమణి కమలా లక్ష్మీ తమ సహృదయంతో దాన గుణంతో నూజివీడు పట్టణానికి మహిళా భవన్ నిర్మాణానికి రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించిన సందర్భంగా నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు కార్యకర్తలు మరియు మెప్మా సంఘ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కమలా లక్ష్మికి తమ కృతజ్ఞతను, తెలియజేసారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కమలా లక్ష్మి భర్త మంత్రి కొలుసు పార్ధసాహరధి పేదలకు సహాయం చేయడంలో ఆయనకు ఆయనే చాటి,విద్యార్థుల ఉన్నత చదువులకు,ఇల్లు కాలి నిస్సహాయక స్థితిలో ఉన్న పేదలకు రూ. 5వేలు, ఐ, ఐ, టి, లో సీటు సంపాదించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు నారా లోకేష్ విద్యామృతం ఇలా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న మంత్రివర్యుల స్పూర్తితో ఆయన సతీమణి కమలా లక్ష్మీ మహిళా భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు విరాళంగా ప్రకటించడం ఎంతో సంతోష దాయకంగా ఉందని తమ కృతజ్ఞతను ఆనందాన్ని వ్యక్తం చేసారు. కూటమి మహిళా నాయకులు కార్యకర్తలు ఏదైనా సమావేశం నిర్వహించాడా నికి,పార్టీ కార్యక్రమాలకు, ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇంతటి బృహుత్తర కార్యక్రమానికి రూ. 20లక్షల ఆర్థిక సహాయం చేసిన కమలా లక్ష్మి పార్ధసాహరధి కి జీవితాంతం రుణపడి ఉంటామని తమ కృతజ్ఞతలు తెలియజేసిన మహిళలు, ఈ కార్యక్రమంలో కూటమి మహిళా నాయకులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

## 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్

## బైక్ ర్యాలీలపై ఇసి నిషేధం విధింపు

అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. తొలిదశ పోలింగ్ ప్రచారపర్వం ముగిసింది. ఏప్రిల్ 23న బెంగాల్‌లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు.

## అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించిన మంత్రుల బృందం

వివిధ అంశాలపై శిక్షణ కోసం సింగపూర్ వెళ్లిన ఏపీ మంత్రులు అక్కడి అవర్ టాంపైన్స్ హబ్‌ను సందర్శించారు. అక్కడి థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మాల్స్, ఫెస్టివ్ ఆర్ట్ థియేటర్‌ను మంత్రుల బృందం పరిశీలించింది. వాటి విశేష్యాలను అక్కడి అధికారులు మంత్రులకు వివరించారు. వివిధ రంగాల్లో పలు అంశాలను వివరించారు. మంత్రుల బృందంలో నారాయణ, అనిత, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి ఉన్నారు. అక్కడి ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను సింగపూర్ అధికారులు మంత్రులకు వివరించారు.

# త్రిస్సూర్ బాణసంచా పరిశ్రమ పేలుడు ఘటన

## 13కు చేరిన మృతుల సంఖ్య

కేరళ త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన ఘటనలో మృతుల సంఖ్య 13 కు చేరింది. 30 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్‌లో నిల్వ ఉంచిన బాణసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగింది. స్థానికంగా పంటపొలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ఘటన సమయంలో మొత్తం అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సమీప ప్రాంతాల్లోనూ బాణసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుడు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బృందాలు వెల్లడించాయి. అయితే, అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదానికి ఓ కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులకు సూచించారు. తీవ్రంగా గాయాలైన బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇతర రాష్ట్రాల వైద్య నిపుణుల సాయం తీసుకోవాలని సూచించారు.

# ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

## ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి

భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా ఏటా రూ. 22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

# 27న బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

## తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం.

# చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

**మంత్రాలయం ఏప్రిల్ 21,** :- మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని వంక బ్రిడ్జి వద్ద ఈ నెల 9 తేదిన రెండు ద్విచక్ర వాహనాల ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటకరాష్ట్రం రాయచూరు జిల్లా మాలియాబాద్ క్యాంపు గ్రామానికి చెందిన తిమ్మరెడ్డి కి తలకు బలమైన గాయం కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి , మెరుగైన వైద్యం కోసం కర్నూలు లోని అమిలియా ఆసుపత్రి , అక్కడ నుంచి బెంగళూరు నారాయణ సూపర్ స్పెషలిస్ట్ ఆసుపత్రి , అక్కడ రాయచూరు లోని రిమ్స్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బందువులు అప్పజెప్పడం జరిగిందని పోలీసులు తెలిపారు.

# రాంకో సిమెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం

## గూడ్స్ ఇంజన్ రైలు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు



**బనగానపల్లె ఏప్రిల్ 21 నంది పత్రిక** రాంకో సిమెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఒక రైతు తీవ్ర గాయాల పాలయ్యారు మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి అనే సాధారణ రైతు ఆసుపత్రి పాలయ్యారు దీనికి సంబంధించిన వివరాలు గ్రామానికి చెందిన రైతులు తెలియజేస్తూ పొద్దున 6 గంటల సమయం లో రైతు తన పొలానికి ట్రాక్టర్ తో వెళుతుండగా పొలం పక్క నుంచి వెళ్ళిన ట్రాక్ ను దాటేందుకు ప్రయత్నం చేశాడు అయితే అకస్మాత్తుగా గూడ్స్ రైలు ఇంజన్ వచ్చి అతని ఢీ కొట్టింది రైల్వే ట్రాక్పై రైలు గూడ్స్ తిరిగే సమయంలో గేట్లు అన్ని క్లోజ్ చేసి గేట్ దగ్గర కాపలా ఉండాల్సిన అవసరం ఉంది అయితే యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా గేట్లు వేయకపోవడం వల్ల రైతు ట్రాక్ మీద ఏమీ లేదనుకొని తన ట్రాక్టర్ను ట్రాక్ పై నుండి తన పొలానికి వెళ్లేందుకు నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడని రైతులు తెలిపారు. అకస్మాత్తుగా గూడ్స్ రైలు ఇంజన్ వచ్చి ట్రాక్టర్ను ఢీకొట్టడంతో ఇంజనుజై ట్రాక్టర్ మీద ఉన్న రైతు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే తోటి రైతులు అతన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు. ట్రాక్ పై గూడ్స్ ఇంజను ఉన్న సమయంలో గేట్లు వేయకపోవడం అక్కడ గాడ్స్ ఎవరిని కాపలా పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దీనికి రాంకో సిమెంట్ నిర్లక్ష్యమే కారణం అని రైతులు ఆరోపిస్తున్నారు.

# సీనియర్ జర్నలిస్టు బలరామిరెడ్డి మృతి పత్రికా రంగానికి తీరని లోటు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల ఏప్రిల్ 21 (నంది పత్రిక):** సీనియర్ జర్నలిస్టు మద్ది కాయల బలరామిరెడ్డి హఠాత్తుగా మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బలరామిరెడ్డి పత్రికా రంగంలో సుదీర్ఘకాలం పాటు వివిధ పత్రికల్లో విలేకరిగా సేవలందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, తనదైన శైలిలో వార్తలు రాసే జర్నలిస్టుగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ప్రత్యేకమైన వ్యాసాలు, ప్రజలకు ఉపయోగపడే రచనలు కూడా వార్తల రూపంలో అందిస్తూ ప్రజాభిమానాన్ని పొందారని తెలిపారు.ఆయన ఆకస్మిక మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని నాగార్జున రెడ్డి అభిప్రాయపడ్డారు. బలరామిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. పత్రికా రంగానికి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని, ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ నిలిచిపోతాయని తెలిపారు.

# దూదేకుల కాంచు దస్తగిరి కుటుంబానికి ఆర్థిక సహాయం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 21 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం ఎస్ లింగం దిన్నె గ్రామానికి చెందిన దూదేకుల కాన్చు దస్తగిరి కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంలో భాగంగా మొదటి విడతగా 3 లక్షల రూపాయలు ఎల్ వో సి చెక్కును అందజేశారు సోమవారం నాడు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బాధితులకు చెక్కును అందజేసి మాట్లాడుతూ మీ ఆర్థిక సాయం ద్వారా కొంత ఆర్థిక ఉపశమనం కలిగిందన్నారు. ఇదే సందర్భంగా రెండో విడత ఎల్‌ఓసి చెక్కు మంజూరు చేయడానికి మరింత బాధిత కుటుంబానికి సహాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సహాయం పట్ల బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

# 4 వారాల్లో నివేదిక.. టీజీఆర్టీసీ ఉద్యోగుల వినతులపై సర్కార్ కీలక నిర్ణయం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆర్టీసీ కార్మికుల సర్వీస్ రూల్స్, ఇతర పెండింగ్ సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి అధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. గత కొంతకాలంగా తమ సేవా నిబంధనలతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీఆర్టీసీ ఉద్యోగుల నుంచి ప్రభుత్వానికి భారీగా వినతులు వస్తున్నాయి. ఈ విజ్ఞప్తులను లోతుగా పరిశీలించిన ప్రభుత్వం.. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధ్యయనం చేసి, తగిన సిఫార్సులు చేసేందుకు ఈ కమిటీకి బాధ్యతలు అప్పగించింది.

# ఇప్పుడు ఆపరేషన్ సముద్ర విజ్ఞాన కేంద్రంగా భారత్

భారత్ విజ్ఞాన యుగం వైపు దూసుకెళ్తున్న దేశంగా ప్రపంచం ముందుకు నిలుస్తోంది. ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు పొందిన ఇండియా, ఇప్పుడు అంతరిక్ష పరిశోధనలు, సముద్ర భద్రత, రక్షణ సామర్థ్యం, శాస్త్రసాంకేతిక రంగాల్లో గొప్ప అడుగులు వేస్తోంది. "నింగి, నేల, అంతరిక్షం" అనే మూడు రంగాల్లోనూ సమానంగా శక్తిని ప్రదర్శిస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతోంది. ముఖ్యంగా "ఆపరేషన్ సముద్ర" వంటి కార్యక్రమాలు, చంద్రుడుసూర్యుడిపై నిర్వహిస్తున్న పరిశోధనలు, అంతరిక్షంలో భారత జెండాను ఎగరవేసిన విజయాలు దేశ గౌరవాన్ని మరింత పెంచాయి. భారత్ అంతరిక్ష ప్రయాణం గురించి మాట్లాడితే ముందుగా గుర్తుకు వచ్చేది 'భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 1969లో స్థాపించబడిన ఈ సంస్థ' , తక్కువ వ్యయంతో అత్యుత్తమ ఫలితాలు సాధించే ప్రపంచ స్థాయి సంస్థగా పేరు తెచ్చుకుంది. గత కొన్ని దశాబ్దాల్లో కమ్యూనికేషన్ ఉపగ్రహాలు, వాతావరణ ఉపగ్రహాలు, నావిగేషన్ వ్యవస్థలు, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా దేశానికి అపార సేవలు అందించింది. ప్రస్తుతం భారత్‌కు 50కి పైగా క్రియాశీల ఉపగ్రహాలు వివిధ కక్ష్యల్లో పనిచేస్తున్నాయి. ఇవి వ్యవసాయం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, సరిహద్దు భద్రత, టెలికమ్యూనికేషన్ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.చంద్రుడిపై భారత విజయగాథలో అత్యంత గొప్ప ఘట్టం ..."చంద్రయాన్ -3" (మూన్ ల్యాండింగ్ ) 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసి ప్రపంచంలో ఆ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ ద్వారా చంద్రుడి ఉపరితలం, మట్టి నిర్మాణం, ఉష్ణోగ్రతలపై విలువైన సమాచారం లభించింది. చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకోవడంలో భారత్ కీలకమైన పాత్ర పోషించింది. "చంద్రయాన్-1మిషన్" ద్వారా చంద్రుడిపై నీటి అణువుల ఆనవాళ్లు గుర్తించడం కూడా భారత శాస్త్రవేత్తల గొప్ప కృషి. సూర్యుడిపై పరిశోధనల విషయంలో కూడా భారత్ వెనుకబడలేదు. ఆధిత్యా-ఎల్- 1 మిషన్ ద్వారా సూర్యుడి కరోనా, సౌర తుఫానులు, సూర్య కిరణాల ప్రభావం వంటి అంశాలను అధ్యయనం చేస్తోంది. ఈ మిషన్ విజయవంతమైతే అంతరిక్ష వాతావరణాన్ని ముందుగానే అంచనా వేసే సామర్థ్యం భారత్‌కు లభిస్తుంది. సూర్యుడి ప్రభావం ఉపగ్రహాలపై, కమ్యూనికేషన్ వ్యవస్థలపై, విద్యుత్ గ్రిడ్లపై ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ప్రపంచంలో కొద్దిమంది దేశాలకే ఉన్న ఈ సామర్థ్యం భారత్‌కు రావడం గొప్ప విషయం.భారత జెండా అంతరిక్షంలో రెపరెపలాడించిందంటే అది కేవలం ఉపగ్రహాల ద్వారానే కాదు, మానవ అంతరిక్ష యాత్ర దిశలోనూ అడుగులు వేస్తోంది. "జ్ఞానయాన్ కార్యక్రమం" ద్వారా భారతీయ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మిషన్ విజయవంతమైతే స్వదేశీ సాంకేతికతతో మానవులను అంతరిక్షంలోకి పంపిన నాల్గవ దేశంగా భారత్ నిలుస్తుంది. ఇది యువతలో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచడమే కాక దేశ ఆత్మవిశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుంది. "ఆపరేషన్ సముద్ర" అనే పదం భారత సముద్ర శక్తిని సూచిస్తుంది. భారతదేశానికి సుమారు 7,500 కిలోమీటర్లకు పైగా తీరరేఖ ఉంది. ఈ విస్తారమైన సముద్ర సరిహద్దులను రక్షించేందుకు భారత నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ ప్రభావం పెరుగుతోంది. సముద్ర భద్రత, వాణిజ్య మార్గాల రక్షణ, సముద్ర దొంగల నియంత్రణ, విపత్తు సహాయం, విదేశీ పౌరుల రక్షణ వంటి కార్యక్రమాల్లో భారత నౌకాదళం విశేష ప్రతిభ కనబరుస్తోంది. 'ఆపరేషన్ రాహత్' , 'ఆపరేషన్ కావేరి' వంటి మిషన్ల ద్వారా వేలాది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. ఇటీవల రెడ్ సీ ప్రాంతంలో వ్యాపార నౌకల భద్రత కోసం కూడా భారత్ యుద్ధనౌకలను పంపింది. సముద్ర మార్గాల్లో భారత ఉనికి పెరగడం వల్ల ప్రపంచ దేశాలు భారత్‌ను నమ్మకమైన భాగస్వామిగా చూస్తున్నాయి. భూమి మీద కూడా భారత్ అభివృద్ధి శిఖరాలకు చేరుతోంది. రక్షణ రంగంలో స్వదేశీ క్షిపణులు, యుద్ధవిమానాలు, ట్యాంకులు, డ్రోన్ల తయారు చేస్తోంది. "తేజస్ లైట్ కంబ్యాక్ ఎయిర్ క్రాఫ్ట్, " అగ్ని మిసైల్ సీరీస్", " బ్రహ్మోస్ క్షిపణి " వంటి ప్రాజెక్టులు భారత శక్తిని ప్రపంచానికి చాటుతున్నాయి. "మేక్ ఇన్ ఇండియా" ద్వారా రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు చర్యలు వేగంగా సాగుతున్నాయి. ఆర్థిక పరంగా కూడా భారత్ వేగంగా ఎదుగుతోంది. ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్, త్వరలో మూడో స్థానానికి చేరుతుందని అనేక అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల్లో " యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్ " ప్రపంచానికి ఆదర్శంగా మారింది. స్టార్టప్ రంగంలో భారత్ ప్రపంచంలో ప్రముఖ స్థానంలో ఉంది.

మొత్తంగా చూస్తే భారత్ ఇప్పుడు కేవలం ఒక దేశం కాదు, ప్రపంచాన్ని ప్రభావితం చేసే శక్తిగా ఎదుగుతోంది. చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకునే శాస్త్రబలం, సూర్యుడిపై పరిశోధనలు చేసే విజ్ఞానదృష్టి, సముద్రాల్లో భద్రత కల్పించే సామర్థ్యం, నేలపై ఆర్థికాభివృద్ధి సాధించే శక్తిఇవన్నీ కలిసి భారతదేశాన్ని ఎదుగుతున్న ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దుతున్నాయి. నింగి, నేల, అంతరిక్షం మూడు రంగాల్లోనూ జెండా ఎగరవేస్తూ, ఇప్పుడు "ఆపరేషన్ సముద్ర" ద్వారా "వికసిత భారత్" లక్ష్యంతో ధైర్యంగా ముందుకు సాగుతోంది.

# ముద్రించిన అక్షరం ముద్ర వేసిన అనుభవం.

మానవ పరిణామ క్రమంలో విజ్ఞానం అనేది ఒక అంతుచిక్కని మహాసముద్రం. ఈ సముద్రాన్ని ఈదడానికి మనకు రెండు ప్రధానమైన తెడ్లు ఉన్నాయి ఒకటి పుస్తక పఠనం, మరొకటి నేరుగా పొందే అనుభవం. పుస్తకాల్లోని అక్షరాలు గొప్పవా? లేక జీవితం నేర్పే పాఠాలు గొప్పవా? అనే ఈ చర్చ ఈనాటిది కాదు. ఇది యుగయుగాలుగా తాత్వికులను, విద్యావేత్తలను, మేధావులను ఒకేలా ఆలోచింపజేస్తున్న ఒక చిక్కుముడి. నిజానికి, ఈ రెండింటి మధ్య పోటీని వెతకడం కంటే, ఒకదానితో ఒకటి పెనవేసుకున్న వీటి పరిపూరకత్వాన్ని అర్థం చేసుకోవడమే అసలైన వివేకం.పుస్తకాలు కేవలం కాగితాల కట్టలు కావు.అవి మానవజాతి వేల సంవత్సరాలుగా పోగుచేసిన మేధో సంపత్తికి సజీవ సాక్ష్యాలు. ఒక మేధావి తన జీవితకాలం మొత్తం చేసిన పరిశోధనను, పడిన శ్రమను ఒకే ఒక్క పుస్తకంలో నిక్షిప్తం చేయగలడు. ఆ పుస్తకాన్ని మనం కొన్ని గంటల్లో చదవడం ద్వారా, ఆ వ్యక్తి జీవితకాల జ్ఞానాన్ని మనం సొంతం చేసుకుంటాం. ఇది కాలయంత్రాన్ని (ఁఅఏఙ మీఖఎష్ట్రఅఅవ) ఉపయోగించినంత అద్భుతమైన విషయం. ఆలోచించండి, ఒక వైద్య విద్యార్థి ఏ పుస్తకం చదవకుండా, కేవలం అనుభవం కోసం నేరుగా ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్తే పరిస్థితి ఏంటి? అది ఘోరమైన విపత్తుకు దారితీస్తుంది. ఇక్కడే పుస్తకాల ప్రాముఖ్యత కనిపిస్తుంది. పుస్తకాలు మనకు ఇతరుల తప్పుల నుంచి నేర్చుకునే వెసులుబాటును కల్పిస్తాయి. మనకంటే ముందు తరం వారు ఎక్కడెక్కడ తడబడ్డారో, ఏ ఏ ప్రయోగాలు విఫలమయ్యాయో పుస్తకాలు మనకు ముందే హెచ్చరిస్తాయి. దీనివల్ల మనం ఆ తప్పులను మళ్ళీ చేయాల్సిన అవసరం ఉండదు, ఫలితంగా మన విలువైన సమయం ఆదా అవుతుంది.అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శాస్త్రవేత్తలు, విప్లవకారులు, కవుల మనసుల్లోకి మనం ప్రవేశించాలంటే పుస్తకాలే ఏకైక మార్గం. ఖండాతరాల అవతలి వ్యక్తులతో, శతాబ్దాల క్రితం మరణించిన మహాత్ములతో మనం సంభాషించే అవకాశం కేవలం అక్షరాల ద్వారానే సాధ్యం.పుస్తకాలు మనకు సిద్ధాంతాలను చెబితే, అనుభవం మనకు వాస్తవాలను చూపిస్తుంది. నిప్పు వేడిగా ఉంటుంది అని పుస్తకంలో చదవడం ఒక ఎత్తు, ఆ నిప్పును తాకినప్పుడు కలిగే మంటను గుర్తించడం మరొక ఎత్తు. నిప్పు మంటను అనుభవించిన వ్యక్తికి ఇక జీవితంలో ఆ పాఠం మర్చిపోయే అవకాశమే ఉండదు. అందుకే అంటారు, అనుభవం అనేది ఒక కఠినమైన ఉపాధ్యాయుడు; అది ముందుగా పరీక్ష పెట్టి, ఆ తర్వాతే పాఠం చెబుతుంది .ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎందరో పారిశ్రామికవేత్తలు, సామాజిక నాయకులు పెద్దగా విద్యాభ్యాసం చేయకపోయినా, కేవలం క్షేత్రస్థాయిలో వారు పొందిన అనుభవాలతోనే సామ్రాజ్యాలను నిర్మించారు. మన జాతిపిత మహాత్మా గాంధీ గారినే తీసుకోండి. ఆయన బారిస్టర్ చదివిన మేధావి, కానీ ఆయనలోని దేశభక్తిని మేల్కొలిపింది చదివిన చట్టాలు కాదు దక్షిణాఫ్రికాలోని పీటర్ మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌లో ఆయనను రైలు నుండి బయటకు నెట్టేసిన ఆ అనుభవం. ఆ చేదు అనుభవమే ఒక సామాన్య న్యాయవాదిని మహాత్ముడిగా మార్చేసింది. అటువంటి భావోద్వేగపూరితమైన మార్పును ఏ విశ్వవిద్యాలయము తీసుకురాలేదు.చదివినది విత్తనం అయితే, అనుభవించినది సారవంతమైన నేల. ఈ రెండూ కలిసినప్పుడే జ్ఞానవృక్షం పచ్చగా వికసించి, విజయాలనే ఫలాలను అందిస్తుంది.మన భారతీయ సంప్రదాయంలో గురుకుల విద్యా విధానం ఈ రెండింటి సమతుల్యతకు ఒక అద్భుత నిదర్శనం. శిష్యులు కేవలం వేదాలను, శాస్త్రాలను కంఠస్థం చేయడమే కాకుండా, గురువుతో కలిసి జీవిస్తూ, దైనందిన పనులలో పాల్గొంటూ, నైతిక విలువలను నేరుగా నేర్చుకునేవారు. అక్కడ పుస్తక జ్ఞానం మరియు అనుభవ జ్ఞానం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉండేవి.మన తెలుగు సాహిత్యం మరియు జానపద కళల్లో కూడా ఈ సత్యం ప్రతిబింబిస్తుంది. అనుభవించిన దెరుగు అందరకు తెలియదు అనే సామెత ఎంతో లోతైనది. అది మన పెద్దలు జీవితాన్ని చూసి, చెక్కిన ఒక సత్యం. పాశ్చాత్య లోకంలో కూడా 'ఎంపిరిసిజం' (జుఎజూఅతీఱఅఎజుఅంఎ) అనే వాదం జ్ఞానం యొక్క మూలం అనుభవమేనని నొక్కి చెబుతుంది. జాన్ లాక్ వంటి తత్వవేత్తలు మనిషి మనసును ఒక శుభ్రమైన పలక (ఖుఎఱశ్రీఖు ౫ుఖు) తో పోల్చారు. ఆ పలక మీద కాలక్రమేణా మన అనుభవాలే కథలను, పాఠాలను రాస్తాయి. నేడు మనం సమాచార విప్లవంలో ఉన్నాం. ఒక క్లిక్‌తో ప్రపంచంలో ఏ సమాచారమైనా మన అరచేతిలోకి వచ్చేస్తోంది. మరి ఈ కాలంలో పుస్తకాలకు విలువుందా? అంటే, ఖచ్చితంగా ఉంది. అయితే జ్ఞానాన్ని గ్రహించే పద్ధతి మారింది. ఇప్పుడు మనర్ శీఖబఎవ లో వీడియో చూసి వంట ఎలా చేయాలో నేర్చుకోవచ్చు (ఇది పుస్తక జ్ఞానానికి ఆధునిక రూపం), కానీ ఆ వంటలో ఉప్పు, కారం ఎంత ఉండాలో తెలియాలంటే మాత్రం మనం స్వయంగా గరిటె తిప్పాల్సిందే (ఇదే అనుభవం).నేటి కార్పొరేట్ ప్రపంచంలో కూడా దీనినే ప్రాముఖ్యత ఇస్తున్నారు. వైద్యులు ఏళ్ళ తరబడి చదివిన తర్వాత హౌస్ సర్జన్సీ చేస్తారు, ఇంజనీర్లు ఇంటర్న్‌షిప్ చేస్తారు. ఎందుకు? పుస్తకాల్లో చదివిన సర్క్యూట్ డయాగ్రమ్, నిజమైన మెషీన్ ముందు నిలబడినప్పుడు భిన్నంగా అనిపించవచ్చు. అందుకే అకడమిక్ నైపుణ్యం ఎంత ముఖ్యమో, దానికి క్షేత్రస్థాయి అనుభవం తోడవ్వడం కూడా అంతే ముఖ్యం.అనుభవం గొప్పదా? పుస్తకం గొప్పదా? అనే చర్చ కంటే, ఈ రెండింటినీ మన జీవితంలో ఎలా మేళవించుకోవాలి అనేది ముఖ్యం. పుస్తకాలు మనకు ఒక దిశను చూపిస్తాయి (=ఖీఎఙఎఖిఙూ), కానీ ఆ దారిలో ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవాల్సింది మన అనుభవమే. పుస్తకాలు మనకు ఊహించే శక్తిని, లోక జ్ఞానాన్ని ఇస్తే, అనుభవం మనల్ని వాస్తవికతలో నిలబెడుతుంది.ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీలు (హార్వర్డ్, ఐఐటి వంటివి) ఇప్పుడు తమ సిలబస్‌లో కేస్ స్టడీస్ మరియు ఫీల్డ్ వర్క్ కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. సిద్ధాంతం మరియు ఆచరణ (ఁష్ట్రవశీతీఏ ఖఅఎ ూతీఅషువ్‌ఱఎఏవ) ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలని అవి అంగీకరించాయి.ప్రస్తుత తరం యువతకు ఒక విన్నపం మీరు చదువును కేవలం మార్కుల కోసం, డిగ్రీల కోసం పరిమితం చేయకండి. మీరు చదివిన ప్రతి విషయాన్ని జీవితంలో ఎక్కడో ఒకచోట అన్వయించే ప్రయత్నం చేయండి. అదే సమయంలో, జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను చూసి కుంగిపోకండి. ప్రతి ఓటమి ఒక పాఠం, ప్రతి దెబ్బ ఒక అనుభవం.అబ్రహం లింకన్ వంటి నాయకులు పెద్దగా చదువుకోలేదు, కానీ స్వయంకృషితో వేల పుస్తకాలు చదివారు. అటు అనుభవం, ఇటు పుస్తక విజ్ఞానం ఆయనను ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిగా తీర్చిదిద్దాయి. మన కవి శ్రీ శ్రీ కవిత్వంలో సామాన్యుడి కష్టాల అనుభవం ఉంది, అదే సమయంలో ప్రపంచ సాహిత్యం మీద పట్టు ఉంది.

అందుకే ఆయన రచనలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.చివరగా చెప్పాలంటే, పుస్తకాలు మనకు దృష్టిని ఇస్తాయి, అనుభవాలు మనకు దృశ్యాన్ని చూపిస్తాయి. దృష్టి ఉన్నప్పుడే దృశ్యాన్ని సరిగ్గా చూడగలం, దృశ్యం ఉన్నప్పుడే దృష్టికి ఒక అర్థం ఉంటుంది. పుస్తకాలు మనసుకు రెక్కలు కట్టి గగనంలో విహరింపజేస్తే, అనుభవాలు ఆ రెక్కలకు బలాన్ని ఇచ్చి తుపానులో కూడా మనల్ని నిలబెడతాయి.జీవితం అనే ఈ మహా పాఠశాలలో పుస్తకాన్ని ఒక మిత్రుడిగా, అనుభవాన్ని ఒక గురువుగా స్వీకరించండి. ఈ రెండు జ్ఞాన మార్గాలను గౌరవించే వ్యక్తి ఎప్పటికీ ఓడిపోడు. జ్ఞానం అనేది కేవలం తెలుసుకోవడం కాదు, తెలుసుకున్న దానిని జీవించడం. ఆ జీవన ప్రయాణంలో మీ అక్షరాలు మీ అనుభవాలై, మీ అనుభవాలు రేపటి తరానికి అక్షరాలై నిలవాలి. ఈ నిరంతర జ్ఞాన యాత్రలోనే మానవ జీవిత సాఫల్యత దాగి ఉంది.

## ఆరోగ్యం కోసం అద్భుతాలు అవసరం లేదు.. ఈ చిన్న మార్పులు చాలు!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది ఆరోగ్యంపై సరైన శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఖరీదైన ఆహారం తీసుకోవాలని, పెద్ద పెద్ద కసరత్తులు చేయాలని చాలామంది భావిస్తారు. కానీ, మన రోజువారీ ఆహారంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మన వంటింట్లో సులభంగా లభించే పదార్థాలతోనే అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు. బీట్‌రూట్ తరచుగా తినడం వల్ల రక్తపోటు (బీపీ) అదుపులో ఉంటుంది. కీరదోసలో ఉండే సిలికాన్, సల్ఫర్ వంటి పోషకాలు శిరోజాల ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. నరాల బలహీనతతో బాధపడేవారు, జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవాలనుకునేవారు క్యారెట్లను తమ ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. ఇక రోగ నిరోధక శక్తిని పెంచడంలో జామ పండ్లది కీలక పాత్ర.

# వైశాఖమాస వైశిష్ట్యం

నారదుని మాటలను విని అంబరీష మహారాజు నారదునితో నిట్లనెను. వైశాఖ మాసము ఇతర మాసములకంటె తపోధర్మాదులకంటె అధికము ఉత్తమము అని చెప్పిన మాట నాకు సరిగా అర్థము కాలేదు. ఏ కారణము వలన వైశాఖము అన్నిటికంటెనుత్తమమైనదో వివరింపగోరుచున్నానని పలికెను. అప్పుడు నారదుడిట్లు సమాధానము నిచ్చెను. మహారాజా ! శ్రద్ధగా వినుము. కల్పాంతకాలమున సృష్టి అంతమగు సమయమున దేవతలకును ప్రభువైన శేషశాయియగు శ్రీమహావిష్ణువు లోకములనన్నిటిని తన ఉదరమున నిలుపుకొని ప్రళయకాల సముద్రమున శయనించియుండెను. జీవరూపమున అనేకత్వమునందిన తన మహిమను తనయందే ఉపసంహరించుకొని యుండెను. నిద్రాంతమున వేదములు శ్రీమహావిష్ణువును మేల్కొల్పినవి. దయానిధియగు శ్రీమన్నారాయణుడు శ్రుతి ప్రబోధమున మేల్కొని తన ఉదరమందున్న సర్వజీవలోకములను రక్షింపనెంచెను. తన ఉదరమున విలీనమైయున్న ప్రాణికోటికి తగిన కర్మ ఫలప్రాప్తికై సృష్టిని ప్రారంభింపవలయునను కోరిక కలుగగనే సర్వలోకాశ్రయమైన సువర్ణపద్మము ఆయన నాభి నుండి వెలువడెను. విరాట్ పురుషునకి చెందినవాడగు బ్రహ్మను పురుషనామముతో సృష్టించెను. వానితోబాటు పదునాలుగు భువనములను కూడా సృష్టించెను. భిన్నవిభిన్నములగు కర్మల నాశ్రయించిన వివిధ ప్రాణులను వారి కర్మ ఫలానుకూలములగు త్రిగుణములను , ప్రకృతిని మర్యాదలను రాజులను , వర్ణాశ్రమ విభాగములను , ధర్మ విధానమును సృజించెను. పరమేశ్వరుడగు శ్రీమన్నారాయణుడు తనయాజ్ఞారూపములుగా చతుర్వేదములను , తంత్రములను, సంహితలను, స్మృతులను , పురాణేతిహాసములను , ధర్మరక్షణకై సృష్టించెను. వీనిని ప్రవర్తింపజేయుటకై ఋషులను కూడ సృజించెను.ఋషులు ఆచరించి ప్రచారము చేసిన వర్ణాశ్రమ ధర్మములను తమకు దగినట్లుగా ప్రజలాచరించుచు సర్వేశ్వరుడగు శ్రీమహావిష్ణువునకు సంతోషము కలుగునట్లుగా ప్రవర్తించుచుండిరి. సర్వోత్తమములగు తమ తమ వర్ణాశ్రమ ధర్మములనాచరించు ప్రజలను వారి ధర్మాసక్తిని , ధర్మాచరణమును తాను స్వయముగ చూడవలెనని భగవంతుడు తలచెను. అప్పుడీ విధముగ నాలోచించెను. తాను సృష్టించిన వర్షాకాలము వర్షముల వలన బాధలుండుటచే పీడితులగు ప్రజలు ధర్మాచరణము సరిగా చేయలేరు. అట్టివారిని చూచిన తనకు తృప్తి కలుగదు సరికదా కోపము కూడా రావచ్చును. కావున వర్షాకాలమున ప్రజల ధర్మప్రవర్తనను పరిశీలించుట తగదు. శరత్కాలమున వారి కృషి వ్యవసాయము పూర్తి కాదు. కొందరు అప్పుడే పండిన పండ్లను తినుచుందురు. నేత్ర వ్యాధులు, చలి మున్నగువానిచే పీడింపబడుచుందురు. ఇట్టి పరిస్థితిలో వారి ధార్మిక ప్రవృత్తిని పరిశీలింపజూచుట యుచితముకాదు. వ్యగ్రులై యేకాగ్రతలేనివారిని చూచినచో నాకేమి సంతోషము కలుగును ? హేమంత ఋతువున చలిమిక్కుటముగ నుండుటచే జనులు ప్రాతఃకాలమున లేచి సూర్యోదయమునకు ముందుగ లేచి స్నానాదికములను ముగించుకొనజాలరు. చలిగాలికి చిక్కి ప్రాతఃకాలమున లేవనివారిని జూచినంతనే నాకు మిక్కిలి కోపము వచ్చును. నేను సృష్టించిన ప్రజలపై నాకు కోపము వచ్చిన వారికి శ్రేయస్కరముకాదు. శిశిరఋతువున ప్రజలను చూడబోయినచో నెట్లుండును ? చలిమిక్కుటముగ నుండు ఆ కాలమున ప్రజలు సూర్యోదయమునకు ముందుగ లేవజాలరు. ఆ కాలమున తమకు కావలసిన ఆహారమును వండుకొనుటకును సోమరులై పండిన పండ్లను తినుచుందురు. అనగా సులభముగా లభ్యములగు ఆహారములకిష్టపడుచుందురు. చలికి భయపడి స్నానమునే మానివేయు స్వభావము కలిగియుందురు. స్నాన విముఖులైన వారు చేయకలిగిన సభక్తికమైన కర్మకలాప మెట్లుండును? ఈ విధముగ జూచినచో వర్షాకాలము నుండి శిశిరము వరకు నుండు కాలమున వివిధములైన ప్రాక్తనకర్మలకు లోబడిన ప్రకృతి వివశులైన ప్రజలనుండి భక్తి పూర్వక కర్మ ధర్మానుష్ఠానమును ఆశింపరాదు. వసంత కాలము స్నానదానములకు , యాగభోగములకు , బహువిధ ధర్మానుష్ఠానమునకును అనుకూలమైన కాలము మరియు ప్రాణధారులకు ఆవశ్యకములగు ఆహార పదార్థములు సులభముగ లభ్యములగును. సులభమైన యే వస్తువు చేతనైనను తృప్తినంద వచ్చును. ఈ విధముగనైనచో సర్వప్రాణిగతమైన జీవాత్మకును యేదో ఒక విధముగ నీటిని , పండ్లను దానము చేసిన సంతృప్తిని కలిగించి ఆ విధముగ సర్వవ్యాపినగు నాకును సంతృప్తిని కలిగించు నవకాశము ప్రజలకు సులభసాధ్యమై యుండును. కర్మిష్ఠులగు భక్తులెల్లప్పుడును కర్మపరాయణులై ధర్మవ్రతము నాచరింతురు. అది చేయలేనివారికి వసంతకాలము కర్మ ధర్మానుష్ఠానములకు తగినది. వసంతకాలమున సర్వ వస్తువులును సులభసాధ్యములగుటచే ధర్మకర్మల యనుష్ఠానము దాన ధర్మ భోగములకు యుక్తమైన కాలము. నిర్ధనులు, అంగవైకల్యము కలవారు, మహాత్ములు మున్నగు సర్వజనులకును, నీరు మొదలగు సర్వపదార్థములు సులభములగును. దానధర్మాదులకు ప్రజలు కష్టపడనక్కరలేదు. పత్రము , పుష్పము , ఫలము , జలము , శాకము , పుష్పమాల , తాంబూలము , చందనము , పాదప్రక్షాళనము వీనిని దానము చేయవచ్చును. దానము చేయునప్పుడు వినయము భక్తి మున్నగు గుణములుండ వలయును. దానము పుచ్చుకొను వ్యక్తి సాక్షాత్తు శ్రీ మహావిష్ణువను భక్తి భావన ముఖ్యము. అట్టి భావనే విలువకట్టరానంత పుణ్యము నిత్తును. అని భక్తసులభుడు దయాశాలియు నగు శ్రీమహావిష్ణువు ఆలోచించి శ్రీ మహాలక్ష్మితో కలసి లోక సంచారమునకై బయలుదేరెను. పుష్పఫలపూర్ణములగు అడవులను , పర్వతములను లతాతరువులను , జలపూర్ణములైన నిర్మలప్రవాహముకల నదులను , తుష్టి , పుష్టి కల ప్రజలను చూచును. ఉత్తమములగు మునులయాశ్రమములను , అందున్న ధర్మ కర్మానుష్ఠాన పరులగు మునులను, వనగ్రామ నగరవాసులై భక్తి యుక్తులైన జనులను , పవిత్రతను అందమును కలిగించు ముగ్గులు మున్నగువానితో నొప్పు యిండ్ల ముంగిళ్లను , ఫలపుష్పాదులతో వ్రతములనాచరించు భక్తులతో నిండి సందడిగనున్న తోటలను , శ్రీమహావిష్ణువు లక్ష్మీ సమేతుడై తిలకించును. భక్తియుక్తులై వినయాది గుణములతో వ్రతముల నాచరించు , యథాశక్తిగ దానధర్మములను చేయుచు అతిథి అభ్యాగతుల నాదరించు ధర్మాత్ములను పుణ్యాత్ములను , కర్మ పరాయణులను మహాత్ములను అందరిని జూచును. అభ్యాగతుడై , అతిథియై బహు రూపములతో వచ్చి ప్రజల ధర్మకర్మానుష్ఠానములలో పాలు పంచుకొనును. సంప్రీతుడై అఖండ పుణ్యమును , అఖండ భోగభాగ్యములను సర్వసంపదలను , తుదకు ముక్తిని స్వయముగ అడుగకనే వారి వారి భక్తియుక్తులకు దాన ధర్మములకు పూజాదికములకు సాఫల్యము నిచ్చి యనుగ్రహించును. దురాచారులు, సోమరులు మున్నగువారైనను సత్కర్మల నాచరించి యథాశక్తి దాన ధర్మములను చేసినచో వారి పాపముల నశింపచేసి పుణ్యమును లేక సుఖములనిచ్చును. అట్లుకాక దుష్టులై సోమరులై నిర్లక్ష్యముగ నున్నచో నెంతటి వారినయినను యథోచితముగ శిక్షించును. కావున సోదర మానవులారా ! మనమెట్టివారమైనను మన శక్తియెట్టిదైనను నిశ్చలమైన భక్తితో శ్రీమహావిష్ణువు నారాధించి యథాశక్తిగ దాన ధర్మముల నాచరించి శ్రీమహావిష్ణువు దయను పొందుట మన కర్తవ్యము. కావున చంచలమైన మనస్సును అదుపులో నుంచుకొని యథాశక్తిగ పూజ , దానధర్మములను , భక్తి వినయములతో శ్రద్ధాసక్తులతో బలవంతముగనైన ఆచరించి శ్రీహరియనుగ్రహమునందుటకు ప్రయత్నించుట మన ముఖ్య కర్తవ్యము ధర్మము బాధ్యత. ఇట్లు లోక సంచారము చేయు లక్ష్మీ సహితుడగు శ్రీమహావిష్ణువును స్తుతించుచు సిద్ధులు , చారణులు , గంధర్వులు , సర్వదేవతలు కూడ వెన్నంటి యుందురు. తమ తమ ధర్మములనాచరించుచు భక్తితో వినయముతో దాన ధర్మములను వ్రతములను చేయు , అన్ని వర్ణములవారిని , అన్ని ఆశ్రమములవారిని చూచినవారును సంప్రీతులై శ్రీమహాలక్ష్మీ సమేతుడై ఇంద్రాది సర్వదేవతా పరివేష్టితుడై , చైత్ర వైశాఖ జ్యేష్ఠాషాఢ మాసములయందు భూలోక సంచారము చేయుచు , శ్రద్ధాసక్తులతో వ్రతములను పూజలను చేయుచు శక్త్యనుసారము దానధర్మములు చేయువారినందరిని యనుగ్రహించుచుందురు. కోరికలను మించి వరముల నిత్తురు. శ్రీహరి వైశాఖమున మత్తులై , ప్రమత్తులై వ్రతాచరణము దానధర్మాదికములు లేనివారిని , గమనించి వారిని రోగములు విచారములు మున్నగువానితో శిక్షించును. వైశాఖ మాసమున తననుగాని , పరమేశ్వరునిగాని , ఇతర దైవతములను సజ్జనులను పూజించినను , వీరందరి స్వరూపుడైన సర్వవ్యాపకుడైన తనను పూజించినట్లేనని తలచి సంతుష్టుడై వరములనిచ్చును. ఇతరమాసములయందు వ్రతాదికముల నాచరించితిమని తలచి వైశాఖవ్రతమును మానిన వారిపై కోపించును. అనగా శ్రీమహావిష్ణువు వైశాఖ వ్రతము మానిన కర్మపరాయణులను గూడ శిక్షించును. వైశాఖ వ్రతము నాచరించిన పాపాత్ములనైనను రక్షించును. అనగా వైశాఖ వ్రతము శ్రీమహావిష్ణు ప్రీతికరమైన వ్రతము. ఈ వ్రతము నాచరించుటవలన శ్రీమహావిష్ణువు సర్వదేవతలు సంప్రీతులై వరముల నిత్తురు. సపరివారముగ వచ్చిన మహారాజును నగరము , గ్రామములు , వనములు , పర్వతములు , నదీ తీరములు మున్నగుచోట నివసించు జనులు దర్శించి యథాశక్తిగ తమకు తోచిన పత్రము , పుష్పము , ఫలము మున్నగు వానినిచ్చి మహాప్రభూ ! తమయేలుబడిలో సుఖముగ నుంటిమి అనుగ్రహింపుమని ప్రార్థించినచో మహారాజు వారి పన్నులను తగ్గించుట , సౌకర్యములను కల్పించుట మున్నగు వానినెట్లు చేయునో అట్లే శ్రీమహావిష్ణు ప్రీతికరమైన వ్రతము నాచరించుచు సద్బ్రాహ్మణులను , అతిథులను , అభాగ్యతులను , దైవభావనతో ఉపచారములు చేసి యథాశక్తిగ దానధర్మముల నాచరించినచో శ్రీహరి సంతుష్టుడై కోరిన కోరికల నిచ్చి రక్షించును. పరివార దేవతలును శ్రీమహావిష్ణువు అనుగ్రహము నందిన వారికి తామును యథోచితముగ వరముల నిచ్చి రక్షింతురు. సపరివారముగ వచ్చిన మహారాజును దర్శింపక కానుకల నీయక యున్నచో మహారాజు కోపితుడై శిక్షించును. పరివారమును యథాశక్తిగ శిక్షింతురో అట్లే వైశాఖమాస వ్రత సమయమున వ్రతము నాచరించి యథాశక్తిగ నెట్లు స్తుతించి దాన ధర్మములు చేయని దురాచారులను శ్రీమహావిష్ణువు ఆయన పరివార దేవతలను యథోచితముగ నట్లు శిక్షింతురు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com